# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 128 మంగళవారం 04 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## ఎన్సీపీలో చీలిక మోడీ పుణ్యమే

**ముంబై, జూలై 3, :**

న్సీపీలో చీలిక ప్రధాని మోదీ పుణ్యమే అని తీవ్ర ఆరోపణలు చేశారు ఆ పార్టీ అధినేత శరద్‌పవార్. ఈ కుట్రకు వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్తునట్టు తెలిపారు. తన కంచుకోట సతారా జిల్లా కరాడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు శరద్‌పవార్. తన రాజకీయ గురువు వైబీ చవాన్ సమాధి దగ్గర ఘననివాళి అర్పించారు. ఎన్సీపీ కార్యకర్తల మద్దతకు తనకే ఉందని స్పష్టం చేశారు శరద్‌పవార్. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందన్నారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుట్రలు చేసి బీజేపీ ప్రభుత్వాలను కూల్చుతోందన్నారు. మహారాష్ట్రలో కూడా మహావికాస్ అఘాడి కూటమి ప్రభుత్వాన్ని కూల్చింది కూడా బీజేపీనే ఆరోపించారు. కార్యకర్తల బలం తనకే ఉన్నట్టు సతారాలో బలప్రదర్శన చేశారు శరద్‌పవార్. మరోవైపు ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఎటు వైపు ఉన్నారో ఇంకా స్పష్టత రావడం లేదు. 40

02

## సుప్రీంకోర్టులో తొలిసారిగా.. డిజిటలైజేషన్

**73 ఏళ్ల న్యాయవ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా.. డిజిటలైజేషన్**

**న్యూ ఢిల్లీ జూలై 3**

సుప్రీంకోర్టులో డిజిటలైజేషన్ దిశగా మరో ముందడుగు పడింది. నేటి నుంచి మూడు కోర్టులు పూర్తిగా పేపర్‌లెస్ గ్రీన్ హైటెక్ విధానాన్ని అమలు చేయనున్నాయి. 73 ఏళ్ల చరిత్రలో న్యాయవ్యవస్థలో పూర్తిగా పేపర్‌లెస్‌గా మారడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోర్టు హాల్‌లో సైతం గత 50 ఏళ్ల సుప్రీంకోర్టు తీర్పు కాపీలను తొలగించనున్నారు. అన్ని ఫైళ్లను డిజిటల్ మాధ్యమాల ద్వారా చూసే వెసులుబాటు కల్పించనున్నారు.



**సుప్రీంకోర్టులో ఫ్రీ వైఫై**

సుప్రీంకోర్టులో కీలక మార్పులు జరుగుతున్నాయి. ఎట్టకేలకు సర్వోన్నత న్యాయస్థానంలో ఉచిత వైఫై సేవలు సోమవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని

02

## 146 అంబులెన్స్ లను ప్రారంభించిన సిఎం జగన్

**విజయవాడ :**

108 అంబులెన్సుల వాహనాలను ఏపీ సీఎం జగన్.. జెండా ఊపి మరీ ప్రారంభించారు. మొత్తం 146 నూతన అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసే దిశగా.. కొత్త అంబులెన్సుల్లో ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు సీఎం జగన్ వెల్లడించారు. ప్రారంభోత్సవ అనంతరం 108 అంబులెన్స్ వాహనంలో వైద్య పరికరాలు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య

02



## 4 నెలలు ఆగితే..ఎవరేంటో తెలుస్తుంది

**హైదరాబాద్, జూలై 3 :**

పార్టీని నడపలేను అంటూ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయిన వ్యక్తి రాహుల్ గాంధీ అని.. కాంగ్రెస్, టీఆర్ఎస్ ఆఔం ఒకటేనని.. రెండూ నాణేనికి బొమ్మా బొరుసు లాంటివన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఖమ్మం కాంగ్రెస్ సభలో రాహుల్ గాంధీ ఉపన్యాసం విని ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. కర్ణాటక విజయంతో రాహుల్ ఊహాలోకాల్లో విహరిస్తున్నాడని, ఒక 4 నెలలు ఆగితే ఎవరి భవిష్యత్తు ఏంటో ఆయనకు తెలుస్తుందంటూ సెటైర్లు వేశారు. బీజేపీకి తెలంగాణలో భవిష్యత్తు లేదని



రాహుల్ గాంధీ తేల్చారు. బీజేపీ భవిష్యత్తు తేల్చాల్సినది తెలంగాణ ప్రజలు, అసమర్థ రాహుల్ కాదు అని.. తెలంగాణ ప్రజలు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ను నమ్మి జనం ఓటేసి కొందరు ఎమ్మెల్యేలను గెలిపిస్తే..

02

## ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై డ్రోన్ కలకలం

**న్యూఢిల్లీ జూలై 3**

ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై డ్రోన్ కలకలం రేపింది. 'నో-ఫ్లైయింగ్ జోన్'లో డ్రోన్లు కనిపించడంతో ప్రధాని నరేంద్ర మోదీ ఎస్పీజీ భద్రతా సిబ్బంది ఢిల్లీ పోలీసులకు సోమవారం తెల్లవారుజామున 5.30 గంటలకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఆ డ్రోన్ కోసం ఢిల్లీ పోలీసుల అన్వేషణ మొదలైంది. ఇప్పటికైతే ఎలాంటి డ్రోన్ ఆచూకీ తెలియలేదు. ప్రధాని నివాసం 'రెడ్ నో-ఫ్లై జోన్ లేదా నో డ్రోన్ జోన్' పరిధిలో ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ

02



## రాజకీయ పార్టీలు ఆర్థిక వివరాలు వెల్లడించాల్సిందే




**న్యూ ఢిల్లీ జూలై 3**

కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కొత్తగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇకపై ఇందులోనే రాజకీయ పార్టీలు తమ ఆర్థిక వివరాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక వివరాలతో పాటు పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఖర్చులు, పార్టీకి వచ్చిన విరాళాలకు సంబంధించిన వివరాలను ఈ పోర్టల్ ద్వారా అందించవచ్చని చెప్పింది. దేశంలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా

02

## జగన్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

**టిడిపి యువనేత నారా లోకేష్**

**నెల్లూరు జూలై 3**



తెలుగుదేశం పార్టీ యువనేత, మాజీ మంత్రి నారా లోకేష్ 145వ రోజు యువగళం పాదయాత్ర నెల్లూరు జిల్లా లో విజయవంతంగా సాగుతోంది. సోమవారం ఉదయం అనిల్ గార్డెన్స్‌లో 'మహాశక్తితో లోకేష్' పేరిట మహిళలు, యువతులతో లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం లో మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమ్మని మించిన దైవం లేదని, మహిళలకు అవకాశాలు కల్పిస్తే, ప్రపంచాన్ని జయించగలరని అన్నారు.ఎన్టీఆర్ మహిళల కోసం యూనివర్శిటీ ఏర్పాటు చేశారని, ఆస్థిలో సగభాగం హక్కు కల్పించారని లోకేష్ అన్నారు. చంద్రబాబు మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారని, బాబు సీఎంగా ఉన్నంత కాలం మహిళలు, యువతుల వైపు చూడాలన్నా భయపడేవారని, జగన్ ప్రభుత్వంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకులు, కూరగాయలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మద్యపాన నిషేధం అమలుచేస్తానని చెప్పి.. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రతి వీధిలో మద్యం పారేలా చేశారని లోకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.తనకు చెల్లెలు లేదనే లోటు ఉండేదని, అమ్మ నన్ను క్రమశిక్షణతో పెంచారని, మొన్న పొరపాటున ఓ మాట అంటే, ఫోను చేసి అమ్మ తిట్టారని, మహిళలని

02



## తాడిపత్రి సీఐ ఆత్మహత్య

**తాడిపత్రి జూలై 3**

అప్పటి వరకు నైట్ అలర్టింగ్ ఆఫీసర్గా డ్యూటీ చేసి తాడిపత్రి సీఐ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. అప్పటివరకు డ్యూటీలో ఉండి సిబ్బందికి సూచనలు చేసిన ఆయన.. ఇంట్లో ఫ్యాన్కి ఉరేసుకుని చనిపోవడం చర్చనీయాం శంగా మారింది. పోలీసులు ఉన్నతాధికారులు వెంటనే స్పాట్కు చేరుకున్నారు.తాడిపత్రిలో సీఐ ఆనందరావు ఆత్మహత్య విషాదం నింపింది. నైట్ అలర్టింగ్ ఆఫీసర్ గా

02

# 146 అంబులెన్స్ లను ప్రారంభించిన సిఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా), ఎంపీ నందిగాం సురేష్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం టి కృష్ణబాబు, పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఒకేసారి 423 కొత్త అంబులెన్సులను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 768 అంబులెన్సులు పని చేస్తున్నాయి. ఇందులో బేసిక్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, నవజాత శిశువుల అంబులెన్సులు తదితరాలు ఉన్నాయి. ఈ గతేడాది జనవరి నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ఎమర్జెన్సీ కేసుల లిస్ట్‌ను ఆరోగ్య శాఖ వెల్లడించింది. 2022 జనవరిలో 93 వేల 451 మందిని, ఫిబ్రవరిలో 76 వేల 142 మందిని, మార్చిలో 88 వేల 775, ఏప్రిల్ లో 92, 337, మేలో 89 వేల 32, జూన్ 86 వేల 225, జులైలో 97 వేల 865, ఆగస్టులో 96 వేల 212 మంది, సెప్టెంబర్ 98 వేల 746 మంది, అక్టోబర్ నెలలో లక్షా 234 మంది, నవంబర్ 81 వేల 364 మందిని అంబులెన్సుల ద్వారా ఆస్పత్రులకు తరలించారని పేర్కొంది. అయితే ఇందులోనూ 19 శాతం గర్భిణీ కేసులు కాగా, 16 శాతం కిడ్నీ డయాలసిస్, 13 శాతం ఇతర కేసులు, 9 శాతం మూత్రపిండ సమస్యలు, 8 శాతం శ్వాస సంబంధిత, 5 శాతం ప్రసూతి సంరక్షణ, 5 శాతం వాహనేతర గాయాలు, 4 శాతం పొత్తి కడుపు నొప్పి కేసులు, 4 శాతం గుండె సమస్యలు, మరో 4 శాతం ద్వరం, 3 శాతం అపస్మారక స్థితి కేసులు, 3 శాతం విష ప్రయోగం కేసులు , మరో రెండు శాతం పాము, కీటకాల కాటు కేసులు, 2 శాతం దాడులు, 2 శాతం ఫిట్స్ కేసులు, 1 శాతం డయాబెటిక్ కేసులు ఉన్నాయి. ప్రభుత్వం వెల్లడించిన లెక్కల ప్రకారం... గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 20 నిమిషాలలోపు 108 అంబులెన్సులు చేరుకోవాలనే నిబంధన విధించగా... 18 నుంచి 19 నిమిషాల్లోనే వస్తున్నాయట. పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాల గడువు విధించగా ట్రాఫిక్ తదితర సమస్యల కారణంగా 15 నుంచి 18 నిమిషాల సమయం పడుతోందని నివేదికలో పేర్కొ?ంది. అత్యధికంగా 19 శాతం వరకు ఎమర్జెన్సీ కేసుల్లో గర్భిణులను 108 అంబులెన్సులు ప్రసవం కోసం ఆస్పత్రులకు తరలిస్తున్నాయి.



# 4 నెలలు ఆగితే..ఎవరేంటో తెలుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల నమ్మకాన్ని వమ్మూ చేస్తూ గాంధీ భవన్ నుంచి 12 మంది తెలంగాణ భవన్ కు వెళ్లారని గుర్తుచేశారు. పార్టీ యావత్తు కట్టకట్టుకుని తెరాస లో విలీనం చేసిన చరిత్ర కాంగ్రెస్ ది. తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని నేత రాహుల్ గాంధీ బీజేపీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ చురకలంటించారు. బీఆరెస్, కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందం చేసుకుని బీజేపీ మీద కుట్ర చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గత కొంతకాలం నుంచి కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పార్లమెంట్ లో పనిచేశాయని.. రాష్ట్రపతి ఎన్నికలు జరిగితే, కాంగ్రెస్ అభ్యర్థిని బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి భారీ ర్యాలీ చేసి సన్మానించడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు చెప్పండి బీఆర్ఎస్ తో కలిసి పనిచేసింది బీజేపీనా, లేక కాంగ్రెసా అని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ డీఎన్యే ఒకటే. రెండూ నాణేనికి బొమ్మా బొరుసు లాంటివన్నారు. పార్టీని నడపలేను అంటూ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయిన వ్యక్తి రాహుల్ గాంధీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎన్నడూ టీఆర్ఎస్/బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో కలిసి పోటీ చేయలేదు అని గతంలో ఈ పార్టీల పొత్తులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో రాష్ట్రంలో, కేంద్రంలో పొత్తులు పెట్టుకుని అధికారం పంచుకున్న పార్టీలకు బీజేపీని విమర్శించే అర్హత లేదంటూ మండిపడ్డారు. బీజేపీ నేతలకు కాంగ్రెస్ ఎంత దూరమో, బీఆర్ఎస్ కూడా అంతే దూరమని స్పష్టం చేశారు. కుటుంబ రాజకీయాలు, అవినీతి పై పోరాడతామని ఎర్రకోట మీద ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన అంశానికి కట్టుబడి ఉంటామన్నారు.సిద్ధాంత పరంగా బీఆరెస్ కి, బీజేపీకి పూర్తి వైరుధ్యం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉంటే తమ స్వార్థ రాజకీయాల కోసం జనం మధ్య చిచ్చు పెట్టే పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ సైనికులను, దేశ గౌరవాన్ని మంటగలిపే పార్టీ కాంగ్రెస్ అని.. కులాలు, మతం, ప్రాంతం పేరుతో పబ్బం గడుపుకునే పార్టీ అని హస్తం పార్టీపై నిప్పులు చెరిగారు కిషన్ రెడ్డి. ప్రధాని పదవి నిలుపుకోవడం కోసం ప్రజాస్వామ్యాన్ని కాలరాసి దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ నేతలకు తమను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఆ పార్టీలకు కుర్చీ కోసం ఆరాటమే తప్ప ఇంకేమీ లేదని.. అందువల్లే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు.

# జగన్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

(మొదటిపేజీ తరువాయి)

గౌరవించాలనే మనస్సు ప్రతి ఒక్కరికీ ఉండాలని అన్నారని లోకేష్ తెలిపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువత ఎక్కువగా నష్టపోయారన్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు లేవు, శాంతి భద్రతలు లేవని అన్నారు. రాష్ట్రంలో గంటకు ఇద్దరిపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, ఇక మహిళా మంత్రులు అయితే మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రోజా ఒక అంశంలో తనకు చీరా, గాజులు పంపిస్తామన్నారని, చీరా, గాజులు ధరించే వారి పట్ల అంత చిన్నచూపా? అని ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గంలో దళిత మహిళని చంపేస్తే చర్యలు లేవని ఆరోపించారు.అంగన్ వాడీ నుంచి పీజీ వరకు మహిళలను గౌరవించాలనే బాధ్యత పెంపొందేలా చర్యలు తీసుకుంటామని లోకేష్ స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో అందరికీ ఒక్కటే చట్టం అమలయ్యేదని, జగన్ ప్రభుత్వంలో కొందరికి చట్టాలు చుట్టాలవుతున్నాయని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం కొన్ని వీధి కుక్కలను తయారు చేసిందని అన్నారు. అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టే వారెవ్వరినీ వదలమని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని అవమానిస్తున్నారని మండిపడ్డారు. శాసనసభ సాక్షిగా తన తల్లిని అవమానించారని, ఆమె బయటకు రారని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని చెప్పారు. ఈ రోజుకూ వైసీపీ నేతలు అవమానిస్తూ ఉంటారని, ఇది ఎంత వరకు న్యాయమో ఏపీలో మహిళలందరూ ఆలోచించాలన్నారు. తన తల్లి పడే బాధ మరే తల్లి పడకూడదని అన్నారు. శాసనసభలో చంద్రబాబుని అవమానిస్తే.. సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని లోకేష్ దుయ్యబట్టారు.

### నాకు కూతురు పుట్టాలని కోరుకున్నా

యువగళం పాదయాత్రలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మహిళలతో సమావేశం అయ్యారు. "మహాశక్తితో లోకేశ్" అనే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. మహిళా శక్తి పేరిట మహిళలతో నిర్వహించిన ముఖాముఖిలో లోకేష్ వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తనకు సోదరి ఉంటే బాగుండేదని చిన్నప్పటి నుంచి అనుకునేవాడినని, తనకు కూతురు పుట్టాలని కోరుకున్నట్లు లోకేష్ తెలిపారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను వేధించిన వారిని వదిలిపెట్టబోమని చెప్పారు. శాసనసభ సాక్షిగా ఏ తప్పు చేయని తన తల్లిని అవమానించిన విషయాన్ని గుర్తు చేశారు.



ముఖ్యమంత్రి కూతురు, మాజీ ముఖ్యమంత్రి భార్య అయిన మా తల్లినే ఇంత ఘోరంగా అవమానిస్తే.. రాష్ట్రంలోని సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వైసీపీ నాయకులు చేసిన అసభ్యకర కామెంట్లకు సుమారు నెల రోజుల పాటు తన తల్లి కుమిలిపోయిందని గుర్తు చేశారు. ఆమె బాధను ప్రత్యక్షంగా చూసి.. ఓ కొడుకుగా ఏమీ చేయలేకపోయినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు ఎవరు చేసినా దానిని ఖండించాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం జరిగిన ప్రతీ ఒక్కరికి కూడా తెలుగుదేశం పార్టీ న్యాయం చేస్తుందని లోకేశ్ అన్నారు. మహిళలపై దాడులు చేయడం వైసీపీ నాయకులు జన్మ హక్కుగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకుల అక్రమాలను ప్రశ్నించిన వారిపై మరిన్ని దాడులు చేస్తున్నట్లు చెప్పారు. బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్తే తిరిగి వారిపై కేసులు పెడుతున్నట్లు గుర్తు చేశారు. అన్ని రంగాల్లో ఏపీ నెంబర్ 1గా ఉంచడమే టీడీపీ లక్ష్యమని నారా లోకేశ్ అన్నారు. రానున్న రోజుల్లో ఏపీకి పెట్టుబడులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఏపీలో పేదరికం లేకుండా చేసేందుకు తెలుగుదేశం పార్టీ సంకల్పించిందని హామీ ఇచ్చారు. టీడీపీ వచ్చాక డాక్టర్లు, పారిశ్రామికవేత్తలను, యువతను రాజకీయాల్లోకి తీసుకొచ్చేలా ప్రోత్సాహిస్తామని చెప్పారు. మరింత మంది విద్యావంతులను రాజకీయాల్లోకి తీసుకునివస్తే విలువలు పెరుగుతాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే మహాశక్తి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై అత్యధికంగా పన్నులు వేసి ప్రజల రక్తం పీలుస్తుందని అన్నారు. ఏపీలో మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి ఆదాయం, కమీషన్ల కోసం మద్యపాన నిషేధాన్ని గాలికొదిలేసినట్లు పేర్కొన్నారు. వచ్చే 25 ఏళ్లు ఏపీలో మద్యం నిషేధించలేరని దానికి కారణం రాబోయే 25 ఏళ్లు మద్యం ఆదాయంపై వైసీపీ ప్రభుత్వం అప్పు తెచ్చిందని ఎద్దేవా చేశారు. సరైన అవకాశాలు కల్పిస్తే ప్రపంచాన్ని శాసించే శక్తి మహిళకు ఉందని నారా లోకేశ్ పేర్కొన్నారు.పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, చంద్రబాబు పాలనలో మహిళలకు పెద్ద పీట వేసినట్లు గుర్తు చేశారు. మహిళల సాధికారత కోసం డ్వాక్రా సంఘాలను చంద్రబాబు నాయుడు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. కానీ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సున్నావడ్డీ రుణాలు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ టీచర్ల జీతాలు పెంచుతామని నారా లోకేశ్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో అంగన్వాడీ టీచర్ల కష్టాలు విన్నానని వారికి తప్పకుండా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. అంగన్వాడీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత విషయంపై మాట్లాడిని లోకేశ్ అధికారంలోకి వచ్చిన తరువాత చర్చించి తప్పకుండా అనుకూల నిర్ణయం వచ్చేలా చేస్తామన్నారు.

# సుప్రీంకోర్టులో తొలిసారిగా.. డిజిటలైజేషన్

(మొదటిపేజీ తరువాయి)

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ వెల్లడించారు. ఐదు కోర్టు గదుల్లో ఈ ఉచిత వైఫై సేవలు తెచ్చామని.. బార్ రూమ్స్‌లో కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని కోర్టు గదుల్లో కూడా ఈ సేవలు అందిస్తామని తెలిపారు. డిజిటైజేషన్ దిశగా ఇది ముందడుగు అని.. ఇక నుంచి లా కి సంబంధించిన పుస్తకాలు పేపర్లు కనిపించవన్నారు. అయితే తాము పుస్తకాలు, పేపర్లపై ఆధారపడబోమని అర్థం కాదని స్పష్టం చేశారు. ఇ-ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగానే ఈ ఉచిత వైఫై సేవలు ఏర్పాటు చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. కోర్టుకు వచ్చే లాయర్లు, మీడియా వ్యక్తులు సహా ఎవరైనా ఈ సేవలు వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఇప్పుడు చీఫ్ జస్టిస్ కోర్టుతో సహా 2.3.4.5 కోర్టు గదుల్లో ఈ వైఫై సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. అలాగే వీటితో పాటు కారిడర్, ప్లాజా, వెయిటింగ్ ఏరియా, క్యాంటిన్ సహా ప్రెస్ లాన్-1.2 ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపింది. ఇదిలా ఉండగా వేసవి సెలవులు పూర్తి కావడంతో సుప్రీంకోర్టు సోమవారమే పునఃప్రారంభమైంది

# ఎన్సీపీలో చీలిక మోడీ పుణ్యమే

(మొదటిపేజీ తరువాయి)

మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉందని అటు అజిత్‌పవార్ , ఇటు శరద్‌పవార్ చెబుతున్నారు. ముంబై ఎన్సీపీ కార్యాలయంలో కూడా హైడ్రామా కొనసాగుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే నేతలతో సమావేశమయ్యారు.నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లో అజిత్ పవార్ తిరుగుబాటు చేసిన ఒక రోజు తర్వాత, పార్టీ చీఫ్ శరద్ పవార్ సోమవారం (జూలై 3) సతారాలో మద్దతుదారులతో పెద్ద ఎత్తున బలప్రదర్శ చేశారు. ఈ సందర్భంగా ఎన్సీపీ నేత శరద్ పవార్ మాట్లాడుతూ, ఈరోజు మనందరం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీపై కూడా విరుచుకుపడ్డారు.శరద్ పవార్ సోమవారం మహారాష్ట్రలోని సతారా చేరుకుని వైబీ చాహ్వాకు నివాళులర్పించారు. సతారాలోని కరద్‌లోని వైబి చవాన్ స్మారక స్థలంలో పార్టీ మద్దతుదారులను ఉద్దేశించి సీనియర్ పవార్ మాట్లాడుతూ.. మనమందరం ఇప్పుడు ఐక్యంగా ఉండాలని అన్నారు. దీనికి ముందు శరద్ పవార్ రోడ్ షో చేసి తన సత్తా చూపించు కునేందుకు సిద్ధమవుతున్నారు.

# ప్రధాని నివాసంపై డ్రోన్ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

జోన్‌లో డ్రోన్లపై నిషేధం ఉంటుంది. అయినప్పటికీ డ్రోన్ కనిపించిందని ఎస్పీజీ అధికారులు చెప్పడం కలకలం రేపుతోంది.ఢిల్లీలోని 'రేస్ కోర్స్ రోడ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం ఉంది. ఈ నివాసం ఐదు భవనాల సముదాయం. 9,7,5,3,1 నంబర్లతో ఆ భవనాలు ఉండటం గమనార్హం. ప్రధాని కార్యాలయ సముదాయం భద్రతా వలయంలో ఉంటుంది. సామాన్య ప్రజానీకానికే కాదు మీడియాకు కూడా అనుమతి కష్టం. కొన్ని సందర్భాల్లో మాత్రమే విలేకరులను కాన్ఫరెన్స్ రూమ్స్ వరకూ అనుమతిస్తారు. అయితే.. ఫొటోలు తీయడం మాత్రం నిషేధం.

# రాజకీయ పార్టీలు ఆర్థిక వివరాలు వెల్లడించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. ఎలక్షన్ కమిషన్ ఈ పోర్టల్‌ను 3సీ వ్యూహంలో భాగంగా పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది. అక్రమ నిధులను అరికట్టడం, రాజకీయ పార్టీల నిధులు, ఖర్చుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యం పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది.తమ ఆర్థిక నివేదికను ఆన్‌లైన్‌లో ఇవ్వకూడదని భావిస్తే.. అందుకు గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని, ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే నిర్దేశించిన ఫార్మాట్‌లో సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ కాపీ ఫార్మాట్‌లో నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో ఆర్థిక నివేదికలను దాఖలు చేయనందుకు పార్టీ పంపిన సమర్థన లేఖతో పాటు అలాంటి అన్ని నివేదికలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తుందని ఈసీ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 మరియు కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ఆర్థిక నివేదికలను రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

# తాడిపత్రి సీఐ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

డ్యూటీ చేసి ఇంటికెళ్లిన ఆనందరావు.. ఇంట్లో ఉరి వేసుకుని సూసైడ్ చేసుకున్నాడు. ఇలా డ్యూటీ దిగి అలా ఇంటికెళ్లారు.. ఈ గ్యాప్లో ఏం జరిగింది? ప్రాణాలు తీసుకునేంత ఇబ్బందులు ఏమై ఉంటాయి? పని ఒత్తిడా..? ఆర్థిక ఇబ్బందులా? ఆనందరావు ఆత్మహత్య వెనుక అసలు కారణాలేంటన్నది మిస్టరీగా మారింది. తాడిపత్రిలో పోలీస్ ఉద్యోగం అంటే సవాళ్ల తో కూడుకున్నది. వర్క్ ప్రెజర్తో పాటు రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉంటాయనే టాక్ వినిపిస్తూ ఉంటుంది.

సమస్య ఏదైనా ఎలాంటిదైనా.. అధికార విపక్ష నేతలు పోలీసులే టార్గెట్గా విమర్శలు చేస్తుంటారు. అందుకే ఇక్కడ విధులు నిర్వహించడం అంటే పోలీసులు తలలు పట్టుకుంటారు. అయితే రాత్రి ఏం జరిగిందో తెలియదు.. డ్యూటీ నుండి వచ్చిన ఆనందరావు కొద్ది సేపటికే ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ఆనందరావు ఆత్మహత్య విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తాడిపత్రి చేరుకున్నారు. ఆయన ఫ్యామిలీ మెంబర్స్‌తో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఆనందరావు ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణంగా చెప్పారు. ఆయనపై ఎలాంటి పని ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. ఫ్యామిలీ మాత్రం ఆనందరావు మృతికి పని ఒత్తిడే కారణమని చెబుతున్నారు. ఆనందరావు కుమార్తె మాట్లాడుతూ.. తన తండ్రి ఎప్పటి నుంచో పని ఒత్తిడిలో ఉన్నారని చెప్పారు. గతంలో చాలా ప్రాంతాల్లో పని చేసినా ఇలాంటి పరిస్థితిలేదని అన్నారు. గత కొద్ది రోజులుగా చాలా ప్రెజర్‌కు లోనైనట్టు తెలియజేశారు. ప్రెజర్ ఎక్కువగా ఉందని హ్యాండిల్ చేయలేకపోతున్నట్టు తరచూ చెప్పేవారని కుమార్తె వివరించారు.

చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన సీఐ గతంలో చాలా ప్రాంతాల్లో పని చేశారు. తిరుపతి, కడపలో కూడా పని చేశారు. గత సెప్టెంబ్‌లో కడప నుంచి తాడిపత్రికి బదిలీపై వచ్చారు. ఎస్పీ శ్రీనివాస్ మాట్లా డుతూ కుటుంబ విభేదాలు, ఆర్థిక ఇబ్బందుల కారణం గానే ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కుటుంబసభ్యుల ఆరోపణలకి పోలీసుల వాదనకు ఎక్కడా పొంతనలేదు. మరి ఆనందరావు ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు. ఇప్పుడిదే మిస్టరీగా మారింది.

# సైకిల్ ఎక్కనున్న ముత్యాల నాయుడు కొడుకు

**విజయనగరం, జూలై 3:**

ఉప ముఖ్యమంత్రిగా, కీలకశాఖల మంత్రిగా ఉన్న బూడి ముత్యాల నాయుడుకి సొంతింట్లోనే సవాళ్లు ఎదురవుతున్నాయి. మాడుగుల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముత్యాలనాయుడుకి కొడుకే తల్నొప్పిగా మారుతున్నాడట. ముత్యాలనాయుడు కుమారుడు బూడి రవికుమార్ ఇటీవల ప్రతిపక్ష నేత చంద్రబాబును కలవడం చర్చనీయాంశమైంది. విజయనగరం జిల్లా ఎస్ కోటలో పర్యటించిన నేపథ్యంలో టీడీపీ నేత కోళ్ల అప్పలనాయుడు ఇంట్లో చంద్రబాబుని కలిశారట బూడి రవి. ఏదో మర్యాదకోసం కలవలేదట ఆయన. డిప్యూటీసీఎంగా ఉన్న తండ్రిపై పోటీ చేసే అవకాశం ఇవ్వాలని చంద్రబాబుని కోరారట రవి. తండ్రి వ్యక్తిగత, అవినీతి వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల మద్దతు కూడగట్టి విజయం గెలుస్తానంటూ..తన అంచనాల గణాంకాలను టీడీపీ అధినేత ముందుంచారట బూడి వారసుడు. దీనిపై ప్రతిపక్ష నేత ఎలా స్పందించారోగానీ ఈ వ్యవహారం ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా తో పాటు రాష్ట్రంలో సంచలనంగా మారింది.వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడి కుమారుడు ఏకంగా ప్రతిపక్ష నాయకుడిని కలవడమంటే అసాధారణ విషయంగానే చూడాలన్నది కొందరి వాదన. అందులోనూ తన తండ్రి పైన పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారన్న వార్త మరింత ఆసక్తి రేపుతోంది. తండ్రితో రవికుమార్ కి తేడా ఎక్కడొచ్చిందన్న దానిపై విస్తృత చర్చ



జరుగుతోంది. బూడి ముత్యాల నాయుడి మొదటి భార్య కుమారుడు రవికుమార్. మొదటి భార్య ప్రమాదంలో మరణించిన తర్వాత ముత్యాల నాయుడు మరో వివాహం చేసుకున్నారు. రవికుమార్ ముత్యాల నాయుడు సొంత చెల్లెలు, తన అత్త నివాసంలో వాళ్ళతో కలిసి ఉంటున్నాడు. తండ్రి కూడా అదే ఊరు సాలువలో ఉంటున్నా ఇద్దరి మధ్య మాటల్లేవ్. తల్లి చనిపోయిన తర్వాత రెండో పెళ్లి చేసుకుని వాళ్ళ పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారన్నది బుడి రవి కంప్లైంట్.ముత్యాలనాయుడు రెండో భార్య కూతురు అనురాధ కోటపాడు జడ్పీటీసీగా ఉన్నారు. ఆమె పోటీ సమయంలోనే తనకు దేవరపల్లి నుంచి జడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని తండ్రిని కోరాడట రవి. అయితే రవిని పక్కన పెట్టి రెండో భార్య కూతురికే ప్రాధాన్యం ఇచ్చారట డిప్యూటీ సీఎం. అనూరాధ జడ్పీటీసీగా గెలిచి నియోజకవర్గంలో తండ్రి తర్వాత అన్నీ తానే పర్యవేక్షిస్తుండటంతో.. బూడి వారసురాలు ఆమేనన్న ప్రచారం బలంగా ఉంది. ఈ పరిణామాలతో తండ్రిపై కోపంతో రగిలిపోతున్నాడట రవి. అందుకే ఏకంగా సీఎం జగన్మోహన్ రెడ్డిని కూడా కలిసి తండ్రిపై ఫిర్యాదు చేశారట. తండ్రి వ్యక్తిగత వ్యవహారాలతో పాటు కొన్ని అవినీతి ఆరోపణలు కూడా చేశాడట బూడి రవికుమార్. పాదయాత్ర సమయంలో అనకాపల్లి జిల్లాలో తన వెంట నడిచిన బూడి రవికుమార్‌తో సీఎంకి సాన్నిహిత్యం ఉందంటున్నారు. సీఎంని కలిశాక ఏమైందోకానీ తర్వాత బూడి రవి చంద్రబాబుని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చకు తావిచ్చింది.బూడి రవికుమార్ వివాహం చేసుకుంది ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బంధువైన అప్పలనాయుడు కూతురినే. వారంతా టీడీపీలోనే ఉన్నారు. చంద్రబాబు విజయనగరం పర్యటనలో ఉన్నప్పుడు చంద్రబాబును కలిసి తన మనసులోని మాట చెప్పారట బూడి వారసుడు. చంద్రబాబు అన్నీ సావధానంగా విన్నా.. బూడి రవికుమార్ కి మాడుగుల టీడీపీనుంచి అవకాశం అంతా ఈజీ కాదన్న చర్చ జరుగుతోంది. మాడుగుల టీడీపీ ఇప్పటికే మూడు వర్గాలుగా విడిపోయి ఆధిపత్య పోరు సాగుతోంది. రామానాయుడు, పీవీజీ కుమార్ టికెట్‌కోసం నువ్వానేనా అంటున్నారు. ఈ పరిస్థితుల్లో వారిద్దరినీ కాదని బూడి రవికి ఛాన్స్ కష్టమేనంటున్నారు. కానీ డిప్యూటీ సీఎం కొడుకు చంద్రబాబుని కలవడం మాత్రం వైసీపీలో చర్చనీయాంశమైంది. దీనిపై బూడి ఎలా స్పందిస్తారో చూడాలి.

# నంద్యాలలో కిలేడీ...

**కర్నూలు, జూలై 3 :**

తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న నెపంతో.. పక్కా స్కెచ్‌తో భర్తని చంపింది ఓ మహిళ. తన ప్రియుడి సహకారంతో మరో మహిళను రంగంలోకి దింపి, భర్తకే వల వేసి, ఒక ప్రాంతానికి రప్పించి.. చివరికి భర్తని పొట్టన పెట్టుకుంది. ఆపై తన భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని నాటకమాడుతూ, కేసుని పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించింది. అయితే.. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, భార్యే అసలు హంతకురాలని తేల్చారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన రాము అలియాస్ వెంకటన్న (42)కు భార్య శ్యామల, కొడుకు శరత్‌చంద్ర(9) ఉన్నారు. వెంకటన్న మెడికల్ షాపు నిర్వహిస్తుండగా.. భార్య ఇంటివద్దే చీరల వ్యాపారం చేస్తోంది. కొంతకాలం క్రితం శ్యామలకు బేతంచెర్లకు చెందిన కుమారస్వామితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే అది వివాహేతర సంబంధంగా మారింది. తన భర్తకు తెలియకుండా కుమారస్వామితో శ్యామల రాసలీలలు గుట్టుగా కొనసాగించింది. అయితే.. వీరి బంధం ఎంతోకాలం దాగి ఉండలేదు. ఎలాగోలా వెంకన్నకు వీరి బండారం తెలిసింది. ఇక అప్పటి నుంచి వెంకటన్న తన భార్యని వేధింపులకు గురి చేయడం స్టార్ట్ చేశాడు. కుమారస్వామికి దూరంగా ఉండాలని హెచ్చరించాడు.అయితే.. ప్రియుడ్ని వదిలి ఉండలేకపోయిన శ్యామల, అడ్డుగా ఉన్న తన భర్తని అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఈ విషయం కుమారస్వామికి చెప్పింది. అప్పుడు వెంకటకన్నను ట్రాప్ చేసి, చంపాలని ప్లాన్ చేశారు. ఒక మహిళని రంగంలోకి దింపారు. ఆమెతో ఫోన్ చేయించి, కుమారస్వామిని ముగ్గులోకి దింపారు. ఈనెల 19న ఆ మహిళతో ఫోన్ చేయించి, భాస్కరాపురం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ గట్టు వద్దకు రావాలని వెంకటన్నని పిలిపించారు. దాంతో.. అతడు వెంటనే అక్కడికి బైక్‌పై వెళ్లాడు. వెంకటన్న ఆ ప్రాంతానికి చేరుకోగానే.. తన నలుగురు స్నేహితులతో కలిసి కుమారస్వామి అతడ్ని చంపేశాడు. వెంకటన్న గొంతుకు బైక్ తీగ బిగించి హతమార్చారు. అనంతరం ముఖం గుర్తు పట్టకుండా రాళ్లతో మోది, అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఇలా తన భర్తని చంపించిన తర్వాత.. శ్యామల తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకేమీ ఎరుగనట్టుగా పోలీసుల ముందు నాటకమాడింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయడం ప్రారంభించారు. అయితే.. శ్యామల మరీ ఓవర్‌గా ప్రవర్తించడంతో, పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. దీంతో.. ఆమె కోణం నుంచి కేసుని విచారించడం మొదలుపెట్టగా, శ్యామలనే తన భర్త వెంకటన్నని చంపినట్టు తేలింది. ఆమెను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నందుకే చంపేశానని ఒప్పుకుంది. ఆమెతో పాటు కుమారస్వామి, అతని నలుగురి స్నేహితుల్ని అరెస్ట్ చేశారు.

# వారాహి యాత్ర సక్సెస్ తో పవన్ ఖుషి

**కాకినాడ, జూలై 3:**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ జూన్ 14వ తేదీ 30వ తేదీ వరకూ గోదావరి జిల్లాల్లో వారాహి యాత్ర నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కోసం మొదటి యాత్ర ఇదే. ఈ యాత్ర ఇలా వరుసగా కంటిన్యూ చేయాలని అనుకుంటున్నారు. ఈ వారాహి యాత్రపై జనసేన ఎన్నో ఆశలు పెట్టుకుంది. దీనికి కారణం నాలుగేళ్లుగా పవన్ ..ఇంత సుదీర్ఘంగా ఎప్పుడూ ప్రజల్లో తిరగలేదు. ఇప్పుడే మొదటి సారి బయటకు వచ్చారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న సమయంలో ఆయన పర్యటనతో ప్రజంలతా పవన్ ను ప్రత్యామ్నాయ శక్తిగా భావిస్తారని ఆశిస్తున్నారు. మరి పవన్ అనుకున్న విధంగా వారాహి యాత్రలో ఆ టెంపో కొనసాగించగలిగారా పవన్ కల్యాణ్ ఎక్కడ ఎప్పుడు వెళ్లినా జన స్పందనకు మాత్రం కొదవ ఉండదు. ఆయన పవర్ స్టార్. ప్రత్యేకంగా జన సమీకరణ చేయాల్సిన అవసరం జనసేన నేతలకు ఉండదు. అందుకే అన్నవరం నుంచి ప్రారంభించి భీమవరం వరకూ జన జాతర కనిపించింది. అన్ని చోట్లా ప్రత్యేకంగా కొన్ని వర్గాలతో సమావేశం అయ్యారు.వారి సమస్యలు విన్నారు. అన్నీ నోట్ చేసుకున్నారు. అదే సమయంలో చేరికల్ని ప్రోత్సహించారు. ఎలా చూసినా వారాహి యాత్ర జన సందోహం విషయంలో అద్భుతంగా విజయవంతం అయిందని అనుకోవచ్చు. అందులో ఎలాంటి సందేహం లేదు. అన్యాయానికి గురైన వాడు ఊగిపోతూనే మాట్లాడతాడని భీమవరంలో పవన్ కల్యాణ్ సీఎం జగన్ కు కౌంటర్ ఇచ్చారు.



పవన్ ప్రసంగాలు గతంలో కన్నా చాలా షార్ప్ గా ఉన్నాయి. నేరుగా వైసీపీ నేతలపై విరుచుకుపడ్డారు. వారి తీరును ప్రజల ముందు పెట్టారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు పవన్ కల్యాణ్ ను కంట్రోల్ చేయడానికి ఎక్కువగా వ్యక్తిగత విమర్శలను నమ్ముకుంటారు. అయితే పవన్ వారిని ఏ మాత్రం లెక్క చేయకుండా వారి భాషలోనే కౌంటర్ ఇచ్చారు. ఘాటు తగ్గించలేదు. భీమవరంలో అయితే ఆయన భాషకు వైఎస్ఆర్సీపీ నేతలు ఒకరి తర్వాత ఒకరు మీడియా ముందుకు వచ్చి పవన్ రాజకీయాలకు పనికి రారని ప్రకటించారు. కానీ పవన్ అలా స్పందించడానికి.. ఆయనను ఇతర నేతలంతా వ్యక్తిగతంగా దూషించడమే కారణం కాదా అన్న ప్రశ్నలు సహజంగానే వస్తున్నాయి. పవన్ కల్యాణ్ ఓ స్ట్రాటజీ ప్రకారమే వారాహియాత్ర సాగేలా చూసుకున్నారు. ప్రధానంగా తనకు మద్దతుగా ఉంటుందనుకున్న సామాజికవర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆయన విస్తృతంగా శ్రమించారు. వ్యూహాత్మకంగా ప్రసంగాలు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా ఉంటుందని భావిస్తున్న వర్గం.. పూర్తి స్థాయిలో ఓట్లు వస్తే.. పవన్ రాజకీయంగా బలపడతారు. ఈ అంశంపై ఆయన రాజకీయంగ వ్యూహాత్మకంగా వ్యవహరించారని.. అంతా తన వైపు ఉండాలని ఆయన ప్రతి చోటా విజ్ఞప్తి చేశారని అంటున్నారు. పవన్ కల్యాణ్‌పై విరుచుకుపడటానికి వైఎస్ఆర్‌సీపీ ఎప్పుడూ రెడీగానే ఉంది. ఆయనపై వైఎస్ఆర్‌సీపీ కాపు నేతలు విరుచుకుపడ్డారు. ముద్రగడ వంటి వారు కూడా తెరపైకి వచ్చారు. చివరికీ సీఎం జగన్ బడి పిల్లల మీటింగ్ లో కూడా పవన్ పై వ్యక్తిగత విమర్శలు చేశారు. ఈ స్పందన చూస్తే ఖచ్చితంగా వారాహి యాత్ర అనుకున్నదాని కంటే ఎక్కువ సక్సెస్ అయిందని జనసేన నేతలు విశ్లేషించుకుంటున్నారు.

# బాలికలకు 16 ఏళ్ల నుంచేశృంగారం

**భోపాల్, జూలై 3 :**

మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సామాజిక మాధ్యమాల యుగంలో బాలబాలికలకు 14 ఏళ్లకే యుక్త వయసు వస్తుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో బాలికలకు శృంగారానికి సమ్మతి తెలిపే వయసును 18 నుంచి 16 తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతో బాలురను చట్టపరమైన చర్యల నుంచి కాపాడొచ్చని తెలిపింది. అయితే 2020లో ఓ బాలికను పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేశాడంటూ ఓ యువకుడిపై గతంలో ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఇప్పుడు తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టు గ్వాలియర్ ధర్మాసనం జూన్ 27 న ఈ కేసును కొట్టివేసింది. ఇక వివరాల్లోకి వెళ్తే ఆ బాలిక ఓ వ్యక్తి వద్ద ట్యూషన్ చెప్పించుకునేది. అతను ఓ రోజు మత్తు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చి తనను అత్యాచారం చేసి వీడియో కూడా తీశాడని ఆ బాలిక తెలిపింది.అలాగే దాన్ని చూపించి బెదిరిస్తూ తనను లొంగదీసుకున్నాడని ఆరోపించింది. ఈ ఘటన జరిగిన తర్వాత ఆ బాలికకు మరో



సన్నిహిత బంధువుతో కూడా శారీరక సంబంధం ఉన్నట్లు హైకోర్టు తెలిపింది. ఇంటర్నెట్ వల్ల బాలబాలికలకు 14 ఏళ్లకే పెద్దరికం వస్తోందని.. హైకోర్టు న్యాయమూర్తి దీపక్ కుమార్ అగర్వాల్ తెలిపారు. తక్కువ వయసులోనే బాలబాలికలు శారీరక ఆకర్షణలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇద్దరి తప్పు ఉన్నప్పటికీ బాలురు మాత్రమే నేరాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలికలకు శృంగారానికి సమ్మతి తెలిపే వయసును తగ్గించడం వల్ల బాలురను కాపడవచ్చని స్పష్టం చేశారు.

# గుడిసెల తొలగింపు..ఉద్రిక్తత

**మహబూబాబాద్**

మహబూబాబాద్ కలెక్టరేట్ సమీపంలో తెల్లవారుజామున ఉద్రిక్తత నెలకొంది. కలెక్టరేట్ సమీపంలోని సర్వే నెంబర్ 255/1 లో ఆరు ఎకరాల భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించారు. పోలీస్ భారీ బందోబస్తు మధ్య గుడిసెల తొలగించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు అడ్డుకున్నారు. పోలీసుల పై కర్రలతో దాడికి గుడిసె వాసులు యత్నించారు. మహిళలకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అందోళనకారులు గుడిసెల వైపు వెళ్ళకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను నెట్టేసి వెళ్ళేందుకు యత్నించారు. తోపులాటలో పలువురు మహిళలు క్రిందపడ్డారు. ఉద్రిక్తతకు దారి తీయడంతో అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. నాలుగు నెలల క్రితం కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ ప్రైవేటు స్థలంలో వెలాది గుడిసెలు వెలిసాయి. గుడిసెలను కూల్చివేయడం ఇది ఆరవ సారి జరిగింది.

# మెట్రో రైళ్లలో విద్యార్థులకు స్టూడెంట్ పాస్ సదుపాయం

**హైదరాబాద్ జూలై 3**

విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. హైదరాబాద్ నగరంలో మెట్రో రైళ్లలో విద్యార్థులు ప్రయాణించేందుకు వీలుగా స్టూడెంట్ పాస్ సదుపాయాన్ని కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. మెట్రో రైళ్లలో విద్యార్థులు ఇక నుంచి హ్యాపీగా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లవచ్చు. నేటి నుంచి మెట్రో రైళ్లలో స్టూడెంట్ పాస్ అందుబాటులోకి తెచ్చినట్లు మెట్రో రైల్వే అధికారులు తెలిపారు. 20 ట్రిప్పుల చార్జీతో 30 ట్రిప్పులు ప్రయాణించే అవకాశం కల్పించినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు.

**షరతులు వర్తిస్తాయి...**

మెట్రో పాస్ కోసం విద్యార్థులు తప్పనిసరిగా కొత్తగా బ్రాండ్ చేయబడిన స్మార్ట్ కార్డ్స్ కొనుగోలు చేయాలి.
ట్రిప్ పాస్ చెల్లుబాటు కొనుగోలు తేదీ నుంచి 30 రోజుల వరకు పని చేస్తోంది.
ఈ ఆఫర్ 1 జులై 2023 నుంచి 31 మార్చి 2024 వరకు తొమ్మిది నెలల పాటు అందుబాటులో ఉంటుంది.
ఒక్కో విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ మాత్రమే జారీ




చేయబడుతుంది.
1 ఏప్రిల్ 1998 తర్వాత జన్మించిన విద్యార్థులు పాస్ పొందేందుకు అర్హులు. ఈ ఆఫర్ పరిమిత కాలం పాటు అందుబాటులో ఉంటుంది.
సంస్థ నిర్ణయం ప్రకారం ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు.
విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెడ్ లైన్ – ఏబెజ కళాశాల, రాఖీ నగర్, అమీర్‌పేట్, విక్టోరియా మెమోరియల్, దిల్‌షుఖ్ నగర్ గ్రీన్ లైన్ – నారాయణగూడ, బ్లూ లైన్ – నాగోల్, పరేడ్ గ్రౌండ్స్, బేగంపేట్ మరియు రాయదుర్గ్ వద్ద పాస్‌లను కొనుగోలు చేయవచ్చని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# ఆలయంలో విగ్రహం ధ్వంసం

**యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో నిన్న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని రెండు ముక్కలుగా ధ్వంసం చేసి తలభాగాన్ని వేరుగా చేసి హుండీని చోరీ చేసి ఆలయంలో ఉన్న పలు విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటన వెలుగు చూసింది, దీంతో ఆలయ సభ్యులు పోలీసుల సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.
ఆలయ నిర్మాణ కర్త రాంరెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా ఆలయంలో హుండీ చోరి జరిగిందని కానీ ఇలా విచక్షణ రహితంగా విగ్రహాన్ని ధ్వంసం చేయలేదని ఈ చర్యలు పాల్పడిన వారిపై పోలీసులు గుర్తించి కటిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ 10 సంవత్సరాల క్రితం జాతీయ రహదారి వెడల్పులో భాగంగా గుడిని పునర్నిమాణం చేసాం. ఇక్కడ మంగళవారం, శనివారం పూజలు జరిగేవి అని తెలిపారు.

## పంట కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



**కొత్తపేట**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మూడేకుర్రు పంచాయతీ పరిధిలోని చిట్టూరివారిపాలెం వద్ద పంటకాలువలోకి ఆటో దూసుకెళ్లింది. అమలాపురం నుంచి ప్రయాణికులతో రావులపాలెం వెళుతున్న ఆటో ఒక్కసారిగా కాలువలోకి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు ఆటోలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

## పెన్షన్ ఇవ్వడంలేదని బైఠాయింపు

**ఒంగోలు**

ప్రకాశం జిల్లా కొండెపి మండలం మిట్టపాలెం సచివాలయం వద్ద గ్రామస్తుల ఆందోళన చేపట్టారు. మూడు రోజులుగా పెన్షన్ ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ గ్రామ సచివాలయం ముందు భైఠాయించారు. దీంతో సచివాలయ అధికారులు తాళాలు వేసి వెళ్లిపోయారు. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకున్నారని.. దీనికి ప్రతిగా ఆ గ్రామంలోని ప్రజలకు పెన్షన్ ఇవ్వకుండా వైసీపీ ఇంఛార్జి వరికూటి అశోక్ బాబు నిలిపి వేయాంచారని పెన్షన్ దారులుఆరోపిస్తున్నారు. ప్రతీనెల సీఎం జగన్ వృద్దులకు ఒకటవ తేదీన ఇచ్చే పెన్షన్ ను ముడు రోజులు గడుస్తున్నా ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. పెన్షన్ నగదు కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

## అనుమానంతో సజీవ దహనం

**పల్నాడు**

తన అన్నను చేతబడి చేసి చంపారని అనుమానంతో స్నెహితుడు నరసింహారావును యూసుఫ్ సజీవదహనం చేసాడు. పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామంలో ఘటన జరిగింది. ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యూసఫ్ మరో స్నేహితుడు నరసింహారావును కలిసి మద్యం సేవిద్దామని చెప్పి గుత్తికొండ అటవీ ప్రాంతంలోకి తీసుకొని వెళ్లి మద్యం సేవించి అనంతరం నరసింహారావు పై నిందితులు పెట్రోల్ పోసి సజీవ దహనం చేసారు. యూసుఫ్ అన్నను ఆరు నెల క్రితం నరసింహ కుటుంబం చేతబడి చేసి చంపారని అనుమానంతో ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీబిడ్డలు మృతి

**విజయవాడ**

విజయవాడ ప్రసూతి ఆసుపత్రిలో విషాదం చోటు చేసుకుంది. ఆసుపత్రిలో తల్లీబిడ్డలు మృతి చెందడంతో బంధువులు ఆందోళన చేపట్టారు. ఏలూరుకు చెందిన తేజస్విని అనే గర్భిణిని ఆమె భర్త సురేష్ కుటుంబసభ్యులు ఆదివారం విజయవాడ ప్రసూతి ఆసుపత్రికి తీసుకువచ్చారు. అదే రోజు రాత్రి ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కానీ శిశువు పుట్టిన కొంతసేపటికే మృతి చెందింది. అనంతరం సోమవారం ఉదయం తల్లి తేజస్విని మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తల్లీబిడ్డ మృతి చెందారని ఆరోపిస్తూ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఆధార్ కార్డు తీసుకురాకపోవడంతో తేజస్వినికి చికిత్స అందించడంలో ఆలస్యం చేశారని బంధువులు చెబుతున్నారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో గవర్నర్

**హైదరాబాద్**

రాష్ట్ర గవర్నర్ తమిళిసై సోమవారం నాడు ఉస్మానియా హాస్పిటల్ లో అన్ని వార్డులను పరిశీలించారు. వార్డుల్లో శుభ్రత, రోగులకు అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. హాస్పిటల్ మూత్రశాల లోపలికి వెళ్లి శుభ్రత ఉందా అని పరిశీలించారు

## దర్శిలో జిల్లా స్థాయి స్పందన

**దర్శి**

జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా దర్శిలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మరియు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి సుదూర ప్రాంతాలు నుండి జిల్లా హెడ్ క్వార్టర్ కు వ్యయ ప్రయసలు పడి రావలసి వస్తుందని వారి సమస్యలు పరిష్కరించడానికి ప్రతి నియోజక వర్గంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికి మూడు వందల అర్జీలు సత్వరమే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి అవకాశాల ఉపయోగించుకోవలాని తెలిపారు. ఎవరికి అయిన ఏ సమస్య వచ్చినా అర్జీ రూపంలో ఇస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను తెలుపుకున్నారు.

# బీజేపీ ప్రెసిడెంట్ రేసులో సత్య


**నెల్లూరు, జూలై 3 :**



ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీకి కొత్త చీఫ్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ తర్వాత పలు రాష్ట్రాల్లో బీజేపీ సంస్థాగత మార్పులు చేయాలనుకుంటోందని ప్రచారం జరుగుతోంది. ఇలా మార్పులు చేయాలనుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ తెలంగాణ కూడా ఉన్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం ఇప్పటికే చర్చనీయాంశమమయింది. ఏపీలో కూడా అధ్యక్షుడి మార్పు అంశం హాట్ టాపిక్ గా మారుతోంది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజు ఉన్నారు. ఆయన పదవి కాలం ముగిసింది. ఆయననే అధ్యక్షుడిగా కొనసాగిస్తామని పార్టీ వ్యవహారాల సహ ఇంచార్జ్ సునీల్ ధియోధర్ గతంలో ప్రకటించారు. నిన్నామొన్నటిదాకా సోము వీర్రాజును తొలగిస్తారన్న ప్రచారం జరగలేదు. కానీ ఇప్పుడు ఏపీలో మారుతున్న రాజకీయ పరిస్థితులు.. వచ్చే ఎన్నికల్లో పొత్తుల అంశాలు హాట్ టాపిక్గా మారుతున్నాయి. రాజకీయ సమీకరణఆలు మారాలంటే ఏపీ బీజేపీ అధ్యక్షుడ్ని మార్చాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా చాలా కాలం నుంచి కోస్తా ప్రాంత నేతే కొనసాగుతున్నారు. ఈ సారి రాయలసీమ నేతను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. కడప జిల్లాకు చెందిన సత్యకుమార్ యాదవ్ ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన ఇటీవలి కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో చురుకుగా ఉంటున్నారు. ఆయనను బీజేపీ చీఫ్ గా చేస్తే.. బీసీ వర్గాలకు .. అలాగే రాయలసీమకూ ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుందన్న అంచనాకు వచ్చినట్లుగా చెబుతున్నారు. సత్యకుమార్ కు బీజేపీ హైకమాండ్ పెద్దల ఆశీస్సులు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఏపీ బీజేపీలో వర్గ పోరాటం కూడా ఉంది. సోము వీర్రాజు వ్యవహారశైలిని ఓ వర్గం గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా సమావేశాలు కూడా నిర్వహించారు. కన్నా లక్ష్మినారాయణ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరినప్పుడు కూడా సోము వీర్రాజు వ్యవహారశైలి వివాదాస్పదమయింది. ఆయనను ఆపేందుకు ప్రయత్నించలేదని.. హైకమాండ్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారన్న విమర్శలు కొంత మంది నేతలు చేశారు. అదే సమయంలో సోముకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నేతలు ఢిల్లీకి కూడా వెళ్లారు. అయితే పార్టీ అంతర్గత వ్యవహారాలను మీడియా ముందు పెట్టవద్దని చెప్పి వారందర్నీ పంపించేసినట్లుగా చెబుతున్నారు. బుధవారం నాటికి ఏపీలో బీజేపీ చీఫ్ ను మారుస్తారా లేదా అన్నదానిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# వీకెండ్స్ కూడా టీడీపీ నేతలతోనే...

**విజయవాడ, జూలై 3 :**



తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇకపై మరింత జోరు పెంచనున్నారు. తెలంగాణా ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌ల్లో కూడా పోరు తీవ్రతరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజకీయంగా దూకుడు పెంచేందుకు ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు ఒక ఎత్తు ఇకపై మరో ఎత్తు అన్న చందంగా చంద్రబాబు డెయిలీ షెడ్యూల్ ఉండబోతోందని ఆ వర్గాలు అంటున్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా హీట్ ఎక్కుతున్నాయి. దీంతో ఏ చిన్న విషయాన్ని కూడా అంత ఈజీగా పార్టీలు తీసుకోవడం లేదు. పార్టీ కార్యకలాపాలపై అధినేతలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలానే చంద్రబాబు కూడా పార్టీపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటి వరకు వారంలో ఐదు రోజులు మాత్రమే చంద్రబాబు విజయవాడ కేంద్రంగా అందుబాటులో ఉంటున్నారు. రాజకీయ నాయకులకు అందుబాటులోకి వస్తున్నారు. ఇప్పుడు ప్రతి నిత్యం నేతలకు అందుబాటులో ఉండాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఓ వైపు తెలంగాణా ఎన్నికల షెడ్యుల్ మరో రెండు నెలల్లో రానుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ముందస్తు రాజకీయాలు ఊపందుకున్నాయి. అక్కడ షెడ్యూల్ ప్రకారమే జరిగినా లేకుంటే ముందస్తు జరిగినా సిద్ధంగా ఉండేలా టీడీపీ ప్లాన్ చేస్తోంది. అందుకే పార్టీ కార్యకలాపాలపై చంద్రబాబు నిత్యం పర్యవేక్షణ చేసేలా సన్నాహాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. పార్టీ శ్రేణులతోపాటుగా, తెలుగు దేశం కేంద్రం కార్యాలయం, హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం వరకు ఉన్న స్టాఫ్‌కు అలర్ట్ ఇచ్చారట. ఇప్పటి వరకు చంద్రబాబు వారంలో ఐదు రోజులు పాటు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ వచ్చారు. అయితే ఇకపై ఏడు రోజులు పాటు పాలిటిక్స్‌లోనే గడపేందుకు యాక్టివ్ అవుతున్నట్లుగా పార్టి వర్గాలు అంటున్నాయి. ప్రతి శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసానికి చంద్రబాబు వెళుతుంటారు. తిరిగి సోమవారం లేదా, మంగళగవారం విజయవాడకు వచ్చే వారు. అయితే ఇకపై వారం రోజులు యాక్టివ్ పాలిటిక్స్‌లో విజయవాడలోనే ఉండాలని నిర్ణయించి నట్టు నేతలు అంటున్నారు. జాతీయ స్థాయి పాలిటిక్స్‌లో కూడా దూకుడు పెంచాలని ప్లాన్ చేస్తున్నారట. రానున్న రోజుల్లో కీలకమైన నేతలను వ్యక్తిగతంగా కలవటం, వారితో మాట్లాడటం చేయబోతున్నారని టాక్.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగు దేశం పార్టీ ఇప్పటికే దూకుడు పెంచింది. రాబోయే రోజుల్లో మరింత యాక్టివ్ పాలిటిక్స్‌పై కసరత్తు కూడా చేస్తోంది. ఓ వైపున తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేస్తూ జిల్లాలను టచ్ చేస్తున్నారు. మరో వైపున భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో నేతల బస్సు యాత్రలో తిరుగుతున్నారు. మూడు జోన్‌లుగా విభజించి మరీ ఐదు బస్సుల్లో ఈ యాత్ర సాగుతోంది. కొద్ది రోజులుగా అధినేత చంద్రబాబు కేంద్ర పార్టీ కార్యాలయంలోనే పార్టీ శ్రేణులను పిలిచి మాట్లాడుతున్నారు. టెలి కాన్ఫరెన్స్‌లను కూడా నిర్వహిస్తున్నారు. రాజకీయాల్లో హ్యాపెనింగ్స్ పై కూడా ఏప్పటికప్పుడు అలర్ట్‌గా ఉంటూ, వాటిపై పార్టీ తరపున రియాక్ట్ అయ్యే విధానం పై దిశానిర్దేశం చేస్తున్నారు. వీటితోపాటు నెలలో ఒకట్రెండు సార్లు జిల్లాల పర్యటనకు కూడా చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఇలా అన్ని వైపుల నుంచి మోహరించి ప్రజలను టార్గెట్ రీచ్ కావాలని చూస్తున్నారు.

# వైభవంగా గిరి ప్రదర్శన

**ఇంద్రకీలాద్రి**



సోమవారం పౌర్ణమి సందర్భముగా ఉదయం లోకకళ్యాణార్థం, భక్త జనశ్రేయస్సు, ధర్మప్రచారం నిమిత్తం వేదపండితుల మంత్రోచ్చరణలు, అమ్మవారి నామ స్మరణలు, మంగళ వాయిద్యముల నడుమ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం(ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లుకు ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తముగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణా ధికారి దర్బముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు కొబ్బరి కాయ కొట్టి కార్యక్రమంను ప్రారంభించారు. గిరిప్రదక్షిణ కార్యక్రమము శ్రీ కామధేను అమ్మవారి ఆలయము, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, సితార, కబేలా, పాల ఫ్యాక్టరీ, చిట్టి నగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు, బేతాల నృత్యములు తదితర సాంస్కృతిక కార్యక్రమముల నడుమ తిరిగి ఆలయమునకు చేరుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గము నందు భక్తులు ప్రచార రథము లో కొలువై ఉన్న శ్రీ అమ్మవారు, స్వామి వార్లకు భక్తిశ్రద్దలతో పూలు, పండ్లు, కొబ్బరికాయ లు సమర్పించి, పూజలు చేసి, అమ్మవారిని, స్వామి వారిని ప్రార్థించి, అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. అమ్మవారి శిఖరం చుట్టూ పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ చేస్తే భక్తుల కోరికలు త్వరగా తీరుతాయని ప్రతీతి.

అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గారు మాట్లాడుతూ పౌర్ణమి సందర్బంగా గిరిప్రదక్షిణ ప్రారంభించినప్పటి నుండి ఈరోజు 6 వ సారి గిరిప్రదక్షిణ అని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సంక్షేమం కొరకు పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరిగినదని, గిరి ప్రదక్షిణలో పాల్గొనడం అందరికీ సంతోషంగా ఉన్నదని తెలిపారు. రాబోవు గిరి ప్రదక్షిణల యందు భక్తులు మరింతగా పాల్గొని శ్రీ అమ్మవారి స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఈరోజు ఆషాడ పౌర్ణమి సందర్భంగా ఉదయం నుండి భక్తులు గిరిప్రదక్షిణ యందు పాల్గొనటం జరిగినదని, ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ప్రారంభించినప్పటి 6 వ సారి ఈరోజు నిర్వహించడం జరిగినదని, గిరి ప్రదక్షిణ కార్యక్రమం నందు భక్తులు ప్రతి నెల విశేషంగా పాల్గొంటున్నారని అన్నారు. రాబోవు గిరి ప్రదక్షిణల యందు భక్తులు మరింతగా పాల్గొని శ్రీ అమ్మవారి స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమం లో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు చింకా శ్రీనివాస రావు, బచ్చు మాధవీకృష్ణ , ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక సిబ్బంది, వేద పండితులు,అధికారులు పాల్గోన్నారు.

## అఖిలేష్ యాదవ్ తో సీఎం కేసీఆర్ భేటీ



**హైదరాబాద్**

సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్., బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. ప్రగతి భవన్ కు చేరుకున్న అఖిలేష్ యాదవ్ ను సిఎం కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారికి మధ్యాహ్నం భోజన ఆతిథ్యం ఇచ్చారు.

## చాతుర్మాస్య దీక్షకు అంకురార్పణ

**రుషికేష్**

విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు చాతుర్మాస్య దీక్షకు అంకురార్పణ చేసారు. గురు పూర్ణిమ సందర్భంగా వ్యాస పూజ నిర్వహించి దీక్షకు శ్రీకారం చుట్టారు. రిషికేష్ లోని విశాఖ శారదాపీఠం ఆశ్రమం ఈ కార్య క్రమానికి వేదికగా నిలిచింది. సనాతన హైందవ ధర్మంలో చాతుర్మాస్య దీక్షకు విశిష్ట ప్రాధాన్యముంది. ఉదయం గంగానదీ తీరంలో పూజలు చేశారు. గంగమ్మ ఒడిలో పవిత్ర స్నానం ఆచరించారు. ఆ తర్వాత గోమాతను పూజించారు. ఈ పూజలో శ్రీకృష్ణుడు, వ్యాసుడు, దక్షిణామూర్తి సహా 45 మంది గురువులను ఆరాధించారు. సెప్టెంబరు 29వ తేదీ వరకు చాతు ర్మాస్య దీక్ష కొనసాగుతుంది. అప్పటివరకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర రిషికేష్ లోనే ఉంటారు. అక్టోబరు మొదటి వారంలో తిరిగి విశాఖకు చేరుకుంటారు.

## గిరిప్రదక్షిణలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యం

**విశాఖపట్నం**

గిరి ప్రదక్షిణను సఫలీకృతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆరోపించారు. గతంలో జరిగిన చందనోత్సవములో భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారని,అధికారులు విఐపిల సేవలకి పరిమితమయ్యారే తప్ప సామాన్య భక్తులకి దర్శన భాగ్యం కల్పిం చలేదని అన్నారు. పిల్లలు , పెద్దలలతో భక్తులు గిరిప్ర దక్షిణలో పాల్గొంటే కనీస సౌకర్యాలు కల్పించలేదని భక్తులకు సేవలు అందించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. అసౌకర్యంతో ఇబ్బందు లు పడుతూ భక్తులు గిరి ప్రదక్షిణ పూర్తి చేశారని,వైసిపి ప్రభుత్వం అన్ని మతాల భక్తులకు ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. గిరి ప్రదక్షిణలో రాష్ట్ర ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ద్వాజమె ట్టారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

**విజయవాడ**

గొల్లపూడి ఇండియన్ ఆయిల్ యూనియన్ బంకులో కెపాసిటర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. సిబ్బంది వెంటనే స్పందించారు. బంకులో ఉన్న ఫైర్ ఎక్విప్మెంట్ తో మంటలను ఆర్పివేసారు. దాంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

**ఉత్తరప్రదేశ్ జూలై 3**

ముఖ్యంగా ఈశాన్యా రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. రాబోయే 5 రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి.” అని వాతావరణ శాఖ సీనియర్ అధికారి నరేష్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో తూర్పు యూపీకి వాతావరణశాఖ హెచ్చరికలు పంపింది. అలాగే ఉత్తర బెంగాల్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో జూలై 2 నుంచి 7 మధ్య ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పాయిగురి, కూచ్‌బెహార్, అలీపుర్‌దువార్ జిల్లాలో ఉరుములతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని తెలిపింది. అదే సమయంలో ఉత్తర బెంగాల్‌లోని మిగిలిన జిల్లాలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని పేర్కొంది.

## శ్రీశైలంలో గురుపౌర్ణమి వేడుకలు

**శ్రీశైలం**

గురుపౌర్ణమి పర్వదినాన్ని పుస్కరించుకుని జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి, హెమారెడ్డి మల్లమ్మ మందిరం వద్ద దక్షిణామూర్తి స్వామికి, వ్యాసమహర్షి కి విశేష పూజలను ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు పూజా సంకల్పాన్ని పఠించి తరువాత మహాగణపతి పూజా చేశారు. అనంతరం దక్షిణామూర్తి మరియు వ్యాసమహర్షి చిత్రపటాలకి షోడశోపచార పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం అర్చకులు, వేదపండితులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు పాల్గొన్నారు.

# కమలంలో అంతర్గత సంక్షోభం

**హైదరాబాద్, జూన్ 3 :**

తెలంగాణ బీజేపీ ఇప్పుడు సంధి దశలో ఉంది. గతంలో పాదయాత్రలని.. మరొకటని జోరుగా ప్రజల్లోకి వెళ్లిన నేతలు ఇప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు.. ట్వీట్లతో కాలక్షేపం చేస్తున్నారు. మా పదవుల్ని తీసేయడం లేదని మీడియాకు వివరణ ఇచ్చేందుకు సమయం వెచ్చిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం జోరు మీద ఉంది. బహిరంగసభలు.. పాదయాత్రలు..చేరికలతో తీరిక లేకుండా ఉంది. పనైపోయిందన్న కాంగ్రెస్ జోరు మీదకు రావడానికి.. ఊపు మీదుందనుకున్న బీజేపీ వెనుకబడిపోవడానికి కారణం ఎవరు ? ఖచ్చితంగా పార్టీ హైకమాండే. అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాలతో పార్టీ నేతల్ని అయోమయంలోకి నెట్టారు.ఇప్పటికీ అది కొనసాగుతోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీజేపీ అనూహ్యంగా రేసులోకి దూసుకొచ్చింది. దీనికి కారణం ఆయన ప్రధానంగా బీఆర్ఎస్ ను టార్గెట్ చేసుకోవడమే. కేసీఆర్‌పై నిర్మోహమాటంగా ఎటాక్ చేస్తూ.. పాలనా వైఫల్యాలపై చురుగ్గా ప్రజల్లోకి వెళ్లారు. కేసీఆర్ అవినీతిపై గట్టిగా ప్రచారం చేస్తూ జైలుకు పంపిస్తామని పలుమార్లు ప్రకటించారు. కేంద్రంలో అధికారం ఉన్న మద్దతుతో బండి సంజయ్ తన శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. పాదయాత్రలు చేశారు. ఉపఎన్నికలు, గ్రేటర్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారు. కానీ ఇప్పుడు ఆయన నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్తామని గట్టిగా చెప్పలేకపోతున్నారు. పార్టీ వ్యహారాల ఇంచార్జ్ వచ్చి చెబుతున్నా ఎవరూ నమ్మడం లేదు. ఎప్పటికప్పుడు నాయకత్వ మార్పు ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. పార్టీలో అంతర్గత సమస్యలకు పూర్తిగా హైకమాండ్‌దే బాధ్యతని బీజేపీ క్యాడర్ అంతృప్తిగా ఉంది. పార్టీలో చేరికలను విస్తృతంగా ప్రోత్సహించారు. అంత వరకూ బాగానే ఉంది కానీ వారి బాధ్యతలేమిటో.. వారికి లభించే ప్రాధాన్యం ఏమిటో మందుగానే వారికి క్లారిటీ ఇచ్చినట్లయితే.. వారు మరింత ప్రాధాన్యం కోసం ఆశపడేవారు కాదనే వాదన ఉంది. కానీ అలా చెప్పకపోవడం.. ఈటల రాజేందర్ ను పార్టీలోకి తీసుకున్న సమయంలో ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంతో ఆయనలో అసంతృప్తి ప్రారంభమయింది. అంతే కాదు కొత్తగా చేరిన .. ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారు ఎవరూ సంతృప్తిగా లేరు. ఈ ప్రభావం పార్టీపై పడింది. పలుమార్లు ఢిల్లీకి సీనియర్ నేతలను పిలిపించుకున్నా.. సమస్యకు పరిష్కారం చెప్పకుండా పంపేశారు. ఫలితంగా అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలేనన్నట్లుగా ఇక బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోరు ఉందని.. బెంగాల్ తరహాలో పోరాటమేనని బీజేపీ నేతలు అనుకున్నారు. తీరా చూస్తే.. మొత్తం కాల్పుల విరమణ జరిగిపోయినట్లుగా పరిస్థితి మారిపోయింది. ఇది తమ పార్టీని ఇబ్బంది పెట్టడమే కాదు.. ఒక్క సారిగా కాంగ్రెస్ పార్టీకి లాభిస్తుందని అంచనా వేయలేకపోయారో .. మరో విధమైన రాజకీయ వ్యూహం ఉందో కానీ.. మొత్తంగా పార్టీ నేతల్ని.. పార్టీని నమ్ముకున్న క్యాడర్‌ని..బీఆర్ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా భావిస్తున్న వారికి షాక్ ఇచ్చినట్లయింది. వారిలో మరో ఆలోచన ఏర్పడేలా చేసింది. ఇప్పటికీ బీజేపీ హైకమాండ్ క్లారిటీ ఇవ్వడం లేదు. బండి సంజయ్ ను కేంద్రమంత్రిని చేసి కిషన్ రెడ్డిని మళ్లీ తెలంగాణ చీఫ్ ను చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఏ నిర్ణయం తీసుకున్నా.. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఇంకా ఆలస్యం చేస్తే అసలు రేసులో లేకుండా పోయే ప్రమాదం ఉందన్న ఆందోళన తెలంగాణ బీజేపీ నేతల్లోనే ఏర్పడుతోంది.

# సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీ చర్యలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ**

**పెద్దపల్లి**



సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ అదనపు కలెక్టర్లు వి. లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్ లతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో దోమలు అధికం కావడం వల్ల సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉన్నదని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆదివారం విద్యా సంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజిబీవి లలో చదివే పిల్లల ఆరోగ్య పై ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలని, ప్రతి రోజూ పిల్లల ఆరోగ్యంపై వార్డెన్ లు నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గత సంవత్సరం బేగంపేట, గద్దలపల్లి, గర్రెపల్లి, జూలపల్లి, ముత్తారం, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అధిక డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, ఈ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మండలాల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, ముందస్తు గానే జాగ్రత్త వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు, ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామంలో ఏర్పాటు చేసిన పారిశుధ్య, ఆరోగ్య కమిటీలను భాగస్వామ్యం చేస్తూ విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలను భాగస్వామ్యం చేస్తూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మహిళలకు, గ్రామస్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత ప్రచారం కల్పించాలని, హెల్త్ మేళాలు ప్రత్యేక పారిశుధ్య డ్రైవులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల కు ఆదేశాలు జారీ చేయాలని, గ్రామీణ ప్రాంతంలో యువతను, వివిధ సంఘాలను భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ కొరకు వైద్యశాఖ చేపట్టాల్సిన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేయాల ని, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారు లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పని చేయాల ని కలెక్టర్ సూచించారు. ఈ సమావే శంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా మలేరియా అధికారి రాజమౌళి, డీ.సీ.హెచ్. ఎస్. డాక్టర్ కె.శ్రీధర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ అక్షింతలు

## విద్యుత్ ఛార్జీలకే రూ.10 వేల కోట్లు

**కరీంనగర్, జూలై 3:**



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రయోజనాలను ఎక్కువ చేసి చూపారని కాగ్ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ లో 46.81 శాతం ఈ ఒక్క ప్రాజెక్టుకే అవసరం అవుతుందని తెలిపింది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై కాగ్ సంచలన నివేదిక ఇచ్చింది. కాళేశ్వరం ప్రయోజనాలు ఎక్కువ చేసి చూపారని కాగ్ తన నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భారీగా పెరిగిందని తెలిపింది. కేంద్ర జల సంఘం రూ.81,911 కోట్ల డీపీఆర్ కు ఆమోదించిందని, అయితే తాజా అంచనా ప్రకారం రూ.1,49,317 కోట్లుగా మారిందని కాగ్ నివేదికలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ లో 46.81 శాతం ఈ ఒక్క ప్రాజెక్టుకే అవసరమవుతుందని కాగ్ తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏడాదిగా అధ్యయనం చేసి కాగ్ తన తుది నివేదిక ప్రకటించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ముందు తక్కువ చేసి చూపించారని కాగ్ నివేదిక పేర్కొంది. ముందు రెండు టీఎంసీలతో చేపట్టినా ఈ ఎత్తిపోతల పథకాన్ని... ఆ తర్వాత మూడు టీఎంసీలకు పెంచారని, దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.28,151 కోట్లు పెరిగిందని కాగ్ వ్యాఖ్యానించింది.పాత ధరల అంచనాలతో డీపీఆర్ రూపొందించారని, తాజా నిర్మాణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొంటే ప్రతి ఎకరాకు మూలధన వ్యయం రూ.6 లక్షల 50 వేలు అవుతుందని కాగ్ నివేదిక తెలిపింది. ప్రతి ఏడాది విద్యుత్ ఛార్జీలకు రూ.10,374.56 కోట్లు అవసరం అవుతుందని కాగ్ పేర్కొంది. వీటన్నింటినీ లెక్కల్లోకి తీసుకుంటే ఎకరాకు నిర్వహణ ఖర్చు రూ.46,364 అవుతుందని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.87,949 కోట్లు 7.8 శాతం నుంచి 10.9 శాతం వడ్డీతో రాష్ట్ర ప్రభుత్వం రుణంగా తీసుకుందని కాగ్ నివేదికలో వివరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకొన్న రుణాలపై అదనంగా రూ. 8182 కోట్ల వడ్డీ పడింది. తిరిగి చెల్లించే గడువు వాయిదా వేయడంతో అదనపు భారం పడిందని కాగ్ నివేదిక పేర్కొంది. 14 ఏళ్లలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అసలు, వడ్డీ కలిపి రూ. 1,41,544.59 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.2015లో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దీంతో 2022 మార్చి వరకు రూ. 87,449.15 కోట్లకు 15 రుణ ఒప్పందాలు చేసుకుంది. ఇందులో నిర్మాణ సమయంలో చెల్లించే వడ్డీ రూ. 11,220.22 కోట్లు ఉందని కాగ్ వర్గాలు తెలిపాయి. 2022 మార్చి వరకు రూ. 64,283.40 కోట్ల రుణాలు ఖర్చు చేశారని కాగ్ తెలిపింది. 15 ఒప్పందాల్లో పదింటికి 2020-21, 2021-22లో తిరిగి చెల్లింపు ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. కాళేశ్వరం కార్పొరేషన్ విజ్ఞప్తితో నాలుగు ఒప్పందాల్లో ఏడాది, 5 ఒప్పందాల్లో రెండేళ్లు వాయిదా వేశాయి బ్యాంకులు. దీంతో అదనపు వడ్డీ రూ. 8182.44 కోట్ల భారం పడుతోందని కాగ్ తాజా నివేదికలో పేర్కొంది.

# ఈనెల 28న ఛలో ఢిల్లీ

**రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**

**విజయవాడ**



రాష్ట్ర విభజన తరువాత ఎపికి అడుగడుగునా అన్యాయం జరుగుతుంది. ఉమ్మడి ఎపిలో రాయలసీమ ప్రాంతం వారు సిఎం లు పని చేశారు. అయినా నేటికీ రాయలసీమ లో తాగు నీరు లేని పరిస్థితి వుందని రాయలసీయ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నదులు ఉన్నా... నీళ్లు ఉన్నా.. రిజర్వాయర్లు లేవు. బ్రిటిష్ వారు కట్టిన డ్యామ్ వల్లే ఇప్పటికి నీరు అందుతుంది. కర్నూలు రాజధానిగా పెట్టి మళ్లీ హైదరాబాద్ తరలించారు. ఇప్పుడు ఈ సిఎం న్యాయ రాజధాని పెడతా అంటున్నారు. ఇంతకంటే అన్యాయం మరొకటి లేదు. సంగమేశ్వర ప్రాజెక్టు కట్టి ఉంటే 24 లక్షల ఎకరాలకు నీరు అందేవని అయన అన్నారు. కోస్ పేట డ్యాం, కృష్ణా ప్రాజెక్టు, బళ్లారి జిల్లా పోయింది. రాయలసీమ నాయకులు మా ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారు. మా దగ్గర ఉన్న ఖనిజ సంపద మరెక్కడా లేదు. ఐరన్ ఓర్, బరైటీస్, మైనింగ్ కొల్లగొట్టుకు పోతున్నారు. పక్క రాష్ట్రం వాళ్లు వచ్చి ఇక్కడ పెత్తనం చేస్తున్నారు. స్థానిక యువతకు అన్యాయం చేసేలా బయటి వారికే ఉపాధి. రాయలసీమ అంటే పెట్టుబడులు పెట్టే వారు రావడం లేదు. సినిమాల్లో మా ప్రాంతం వాళ్లను రౌడీలు, కబ్జా కోరులుగా చూపించి సొమ్ము చేసుకుంటున్నారు. రాయలసీమ ప్రాంత నాయకులే మా అభివృద్ధి ని పట్టించుకోలేదు. టిటిడి వంటి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మా వద్ద ఉంది. మాకు అన్నీ ఉన్నాయి.. లేనిదల్లా రాజకీయ నాయకుల దయ అన అయన అన్నారు.

మా ప్రాంతం వాళ్లు వలసలు పోయి మూటలు మోసి, కప్పులు కడిగి జీవనం సాగిస్తున్నారు. కేంద్రం, రాష్ట్రం కళ్లు తెరవాలి.. జగన్మోహన్ రెడ్డి స్పందించి మోడీ పై ఒత్తిడి తేవాలి. మాకు ఆత్మహత్య లు నిరంతరంగా సాగుతున్నాయి. ఒక్క ఛాన్స్ అని ఓటు వేయించుకున్న జగన్మోహన్ రెడ్డి రాయలసీమ కు ఏమీ చేయలేదని అన్నారు.

మా ప్రాంతానికి మీరు ఏం చేశారో చెప్పాలని జగన్ ను అడుగుతున్నా. అత్యంత అన్యాయం జగన్ సిఎం అయ్యాకే జరిగింది. అప్పర్ భద్ర ప్రాజెక్టు 26వేల కోట్లతో కడుతున్నారు. మూడు రాష్ట్రాల్లో ఎనిమిది జిల్లాలు ఈ ప్రాజెక్టు వల్ల నష్టం జరుగుతుంది. కడప, అనంతపురం, చిత్తూరు, జిల్లాలు కు నీరు వచ్చే పరిస్థితి ఉండదు. అప్పర్ భద్ర వల్ల రాయలసీమ నాశనం అవుతుందని జగన్ కేంద్రానికి ఎందుకు చెప్పలేదని అన్నారు. నేడు అప్పులు లేని కుటుంబం రాయలసీమ లో ఒక్కటి కూడా లేదు. నది దాటక ముందు ఒక మాట, దాటాక మరో మాట అన్న విధంగా రాయలసీమ విషయంలో జగన్ తీరు ఉంది. ఎందుకూ పనికి రాని కేబుల్ బ్రిడ్జి ఎందుకు... సెల్ఫీలు దిగడానికా. సిఎం కు లేఖ లు రాసినా పట్టించుకోరు, వినిపించుకోరు. జగన్ చెవిలో సీసం పోసుకున్నారు కాబట్టి సేవ్ రాయలసీమ పేరుతో పోరాటం చేస్తాం. మా రాయలసీమ హక్కుల కోసం జులై 28న ఛలో ఢిల్లీ కి పిలుపునిచ్చాం. ఇప్పటికే ప్రత్యేక రైళ్లు కూడా ఏర్పాటు చేసేలా మాట్లాడాం. అమ్మ ఒడి పేరుతో మాయ, మోసం. ఎలిమెంటరీ స్కూల్ వ్యవస్థ ను జగన్ నాశనం చేశారు. చిన్న బాల శిక్ష, పెద్ద బాల శిక్ష మన పెద్దలు ఆచారంగా పెట్టి వెళ్లారు. ఇప్పుడు ఆ బాల శిక్ష అంటే ఏమిటో పిల్లలకు తెలియకుండా చేశారు. బటన్ నొక్కడం ఒక వైపు.. మరో వైపు కత్తిరించడమే జగన్ పాలన. ఎపి లొ నిరుద్యోగులు కు పిల్లను కూడా ఇవ్వడం లేదు. అమ్మ ఒడి కి పిల్లను ఇస్తారా... సంపాదన చేస్తే పిల్లను ఇస్తారా. అమ్మ ఒడి డబ్బులు కూడా పడటం లేదు. హైకోర్టు లో ఒక యన్.ఆర్.ఐ ని ఎత్తుకెళితే దిక్కు లేదు. వరంగల్ లో అమ్మాయి మీద యాసిడ్ జరిగితే వైయస్ ఎన్ కౌంటర్ చేయించారు. అసలు జగన్ ఉప్పు కారం తింటాడా... అంతా చప్పగా ఉంది. వాళ్ల పార్టీ ఎంపి కుటుంబాన్ని కిడ్నాప్ చేస్తే దిక్కు లేదని అయన ఆరోపించారు.

# ప్రతిభను ప్రోత్సాహిస్తే రాణింపు

**పదిలో అదరగొట్టిన గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహకం**

**రూరల్ సీఐ మోహన్ రెడ్డి వెల్లడి**


**ఎమ్మిగనూరు**




ఎమ్మిగనూరు మండల పరిధిలో పదవ తరగతి ప్రతిభా వంతులైన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత స్థానాలను చేరుకుంటారని ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ కె.మోహన్ రెడ్డి× పేర్కొన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో పదవ తరగతిలో ప్రతిభ చాటిన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించారు. సోమవారం మండలంలోని బనవాసి ఏ.పి.ఆర్.ఎస్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవ తరగతిలో సత్తా చాటి అదరగొట్టిన మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వరుసగా ఐదు, మూడు, రెండు వేల రూపాయల నగదు, గోల్డ్ మెడల్ తో పాటు మెమొంటోలను అందించి ప్రోత్సహించారు. అనంతరం మెరికల్లాంటి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు కఠోర దీక్ష, నిరంతర సాధనను అలవర్చుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, పోలీసులు చంద్ర, సుధాకర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతికి మరో వందే భారత్

**విజయవాడ, జూలై 3:**



ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ బుల్లెట్ ట్రైన్ అయిన వందే భారత్ రైలు అందుబాటులోకి రాబోతుంది. విజయవాడ నుంచి చెన్నై మధ్య ఈనెల 7వ తేదీ నుంచి రాకపోకలు సాగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా ఐదు వందేభారత్ రైళ్లను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అందులో విజయవాడ నుంచి చెన్నై మధ్య నడిచే రైలు కూడా ఉంటుందని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులకు సమాచారం అందింది.విజయవాడ, చెన్నై మధ్య నడిచే ట్రైన్ ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. ఈనెల 8వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో రాకపోకలు సాగుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించిన రాకపోకల, షెడ్యూల్, టిక్కెట్ ధరలు గురించి ఒకటి లేదా రెండు రోజుల్లో బయటకు రానున్నాయి. ఈ రైలును రేణిగుంట మీదుగా నడపాలని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు కోరినట్టు తెలిసింది. ఆ ప్రకారం విజయవాడ నుంచి గూడూరు, రేణిగుంట, కాట్పాడి మీదుగా చెన్నై వెళ్లి. అదే మార్గంలో తిరిగి రానుంది. విజయవాడ నుంచి తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, వందేభారత్ ను రేణిగుంట మీదుగా నడపాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట్లు విజయవాడ డివిజన్ రైల్వే అధికారి తెలిపారు.

# సింగరాయకొండలో ఉద్రిక్తత

**ఒంగోలు**

ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.. తనపై నియోజకవర్గ వైసీపీ ఇంచార్జీ వరికూటి అశోక్ బాబు అనుచరుల దాడికి నిరసనగా సింగరాయకొండ వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసీపీ కార్యకర్త సాయివేణు నిరాహార దీక్షకు యత్నించారు.. ఇక్కడ దీక్షలు చేయటానికి వీలు లేదంటూ ఇంచార్జీ అశోక్ బాబు అనుచరులు అడ్డుకోవటంతో ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసనను తెలిపే హక్కులు ఉన్నాయంటూ మాజీ ఇంచార్జీ మాదాసి వెంకయ్య వర్గీయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.. దీంతో ఇరువర్గాలు తీవ్ర వాగ్వివాదానికి దిగటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. నిన్న టంగుటూరు జాతీయ రహదారిపై ఉన్న జునో బేకరీ వద్ద మాజీ ఇన్ ఛార్జ్ వెంకయ్య తన అనుచరులతో కలిసి టీ తాగేందుకు ఆగారు. అయితే అదే సమయంలో తన అనుచరులతో కలిసి అక్కడకు వచ్చిన కొండపి వైసీపీ ఇన్ ఛార్జ్ అశోక్ బాబు ఒక్కసారిగా వెంకయ్యపై దాడికి యత్నించారు. వెంకయ్యపై దాడిని ఆయన అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంకయ్య వర్గానికి చెందిన సాయి వేణు అనే యువకుడిపై అశోక్ బాబు వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటనలో సాయికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన సాయిని చికిత్స కోసం ఒంగోలు రిమ్స్ కి తరలించారు. తనకు న్యాయం చేయాలంటూ సింగరాయకొండలో నిరాహారదీక్ష చేసేందుకు ప్రయత్నించటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.. దీంతో నిరాహారదీక్ష ప్రదేశం వద్దకు భారీగా మాజీ ఇంచార్జ్ మాదాసి వెంకయ్య వర్గీయులు చేరుకుంటున్నారు.. పరిస్దితి ఉద్రిక్తంగా ఉండటంతో భారీగా మోహరించారు..

# వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎంపి కేశినేని

**విజయవాడ**

దాదాపు 2 కోట్ల ఎం.పి నిధులతో వాటర్ ట్యాంకులు ఇచ్చే కార్యక్రమన్నీ ఎం.పి కేశినేని ప్రారంభించారు...కృష్ణ నది పక్కనే ఉన్న విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గనీ లో నీటి ఎద్దడి ఏర్పడిందని, కిడ్నీ బాధితుల కోసం ప్లాంట్ నిర్మించి రెండు కోట్ల రూపాయల ఇప్పటి వరకు ఖర్చు చేశాను అని పేర్కొన్నారు..రాజకీయాలు మాట్లాడటానికి ఇది సందర్భం కాదని మీట్ ది ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేస్తే అన్ని విషయాలు మాట్లాడతా అని రాజకీయాలకు సంబంధించిన అంశాలతోపాటు ఇతర విషయాలపై కూడా ఖచ్చితంగా మాట్లాడతా అని కేశినేని నాని స్పష్టం చేసారు... పార్టీ ల కు అతీతంగా వాటర్ ట్యాంక్ లు ఎం.పి కేశినేని నాని ఇస్తున్నారని, గతం లో టాటా ట్రస్ట్ ద్వారా అనేక సేవ కార్యకమలు చేపట్టారని జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇన్ని వాటర్ ట్యాంకులు ఇస్తాం చాలా సంతోషంగా ఉందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలియచేసారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

**మంథని**

గురు పౌర్ణమిని పురస్కరించుకొని సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఐటీ కన్సల్టెంట్ ముప్పిడి ఉదయరాజ్ – సరిత (హన్మకొండ) దంపతుల సహకారం తో పుట్టపాక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు కావాల్సిన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లతో పాటు బిస్కెట్ ప్యాకెట్లను విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిధిగా రిటైర్డ్ టీచర్ కొరకొప్పుల రాజశేఖర్, పుట్టపాక సర్పంచ్ రొద్ద మమతా శ్రీనివాస్, ట్రస్ట్ చైర్మన్ మేడగొని వెంకటేష్, స్కూల్ హెడ్ మాస్టర్ ప్రసన్న, శోభన్ బాబు, తిరుమలేశ్వర్, ముప్పిడి సూతిక్షన్, షణ్ముకి పాల్గొన్నారు.

# ఏడేళ్ళుగా తిరుగుతున్నా..పాసుపుస్తకం రాలేదు

**-జిల్లా కలెక్టరుకు బాధితుల ఫిర్యాదు**

**పెద్దపల్లి**

అధికారులు చేసిన పొరపాటు వల్ల తమ వ్యవసాయ భూమిలోని 1.15 ఎకరం ఇతరులు పేరున నమోదయ్యిందని సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన రైతులు ప్రజావాణిలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూమి వారసులు వేముల రాజు, వేముల పోచమల్లు మాట్లాడుతూ, సర్వే నం.54/5 లో 2ఎకరాల 5గుంటలు వారసత్వంగా సంక్రమించిందని, అధికారుల పొరపాటు కారణంగా తమకు చెందిన సర్వే నంబరు ఇతరులకు కేటాయించడం జరిగిందని వాపోయారు. నేటివరకు కూడా ఈ భూమిలో సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అధికారుల చేసిన పొరపాటు వల్ల ఏడేళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నామని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరణి పోర్టల్లో వివరాలు నమోదు చేసి కొత్త పట్టాపాసుపుస్తకము ఇప్పించాలని కోరారు.

# మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్**

మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్ ను మంత్రి కేటీఆర్ హైదరాబాద్ లోని కోకాపేట్ లో ప్రారంభించారు. నాస్కామ్ ప్రకారం గత రెండేళ్లలో టెక్నాలజీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్ లోనే సృష్టించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. దేశానికి లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపల్ హైదరాబాద్‌లో ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ తన వర్క్ ఫోర్స్ ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెమీ కండక్ట రంగంలో భారత్ ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతోందన్న మంత్రి కేటీఆర్.. వచ్చే దశాబ్దంలో ఆ రంగంలో భారత్ దూసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషించనున్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మందికి సొంత ఖర్చులతో శిక్షణ ఇస్తుందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ స్కిలింగ్ రంగంలో కూడా తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. అమెరికాలోని ఆరిజనోనా రాష్ట్రంలో చాండ్లర్ లో మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉంది. స్మార్ట్, కనెక్టెడ్, సెక్యూర్ ఎంబెడ్ కంట్రోల్ సొల్యూషన్స్ కంపెనీ కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆటోమేటివ్, ఏరోస్పేస్, డిఫెన్స్, కంప్యూటింగ్ మార్కెట్లకు చెందిన లక్షా 25వేల మంది కస్టమర్లకు ఆ కంపెనీ సేవల్ని అందిస్తోంది. ఈ క్రంలోనే మైక్రోచిప్ సంస్థ అధినేతలకు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు చెప్పారు. మైక్రోచిప్ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం

**ఖమ్మం**

ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభకు హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభిమానులందరికి కృతజ్ఞతలు. 27న మేము రాహుల్ గాంధీని కలిశాం. కేవలం 5 రోజుల్లో జనగర్జన సభ ఏర్పాట్లు చేశాం. కొందరు నాయకులు అభిమానులు అజ్ఞాతంలో ఉండి పని చేశారు. ఈ సభ విజయానికి రహస్యమేమీ లేదు. గడిచిన 4 ఏళ్ళుగా నాకు అధికారం లేకపోయినా నేను ప్రజలతో మమేకమైనాను. దానితో ప్రజలు వారి ప్రేమ అనురాగం ఆప్యాతలు నాపై చూపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనీ శ్రేణులు నాయకులు కలిసి పని చేయబట్టే ఆ సభ అంతలా జరిగిందని అన్నారు. గతంలో అధికార ప్రతి పక్ష పార్టీలు పెట్టిన సభలు చూసారు. వాటిలో ఏ సభ విజయవంతం అయిందో ప్రజలకు తెలుసు.

సభ ఏ విధంగా జరిగిందో నేను చెప్పాల్సిన అవసరం లేదు. రాహుల్ గాంధీ వచ్చిన నాటి నుండి ఎంత అభిమానం ఉందో అభిమానుల జోష్ తో తెలిసిపోతుంది. సభ జరగక ముందే చెప్పా మీ సభ జరిగిన దాని కంటే ఎక్కువమందితో సభ నిర్వహిస్తామని వారికి సభ లో ప్రజలు కనిపించకుంటే వారు పెట్టిన సంక్షేమ పథకం కంటి వెలుగులో చూపించుకొండి. నా కూతురి వివాహానికి



నాగార్జున సాగర్ కాలువపై ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జి గురించి తీసివేయాలి ఆదేశించారు. దానిపై మేము కోర్ట్ కి వెళ్లి స్టే తీసుకుని వచ్చాం. రవాణా కోసం ఆర్టీసి బస్సులు కోసం అధికారులను సంప్రదిస్తే ఆ బస్సులను ఆపారు. జూల్లురుపాడులో సుమారు 200 డీసీఎం ట్రక్ లు నిలిపివేశారు. ఆర్టీవోతో మాట్లాడితే ఆయన డీసీఎంలలో ప్రజా రవాణా చేయకూడదు అంటున్నారు. అంత పెద్ద సభలో లక్షల మంది ప్రజలు వస్తె పోలీసులు రక్షణ కల్పించలేదు. అభిమానులు బారికేడ్లను నెట్టి సభ స్టేజ్ వద్దకు వచ్చారంటే పోలీసుల వైఫల్యం ఎంటో అర్థమవుతుంది.

నిన్న జరగరాని ఘటన జరిగి ఉంటే దానికి బాధ్యులు ఎవరు. సీఎం కెసీఆర్ కాదా తెలంగాణ డిజిపి కాదా పోలీస్ వ్యవస్థ కాదా. చివరికి నీతి మాలిన పని మంచి నీటిని నిలిపివేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత నీఛాతి నీచంగా దిగజారింది. గిరిజనుల మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నడూ లేనివిధంగా ప్రేమ నిన్ననే ఒలకబోశారు. పోడు పట్టాలు నిన్న కాకుంటే ఇంకెప్పుడు ఇవ్వమని భయ భ్రాంతులకు గురి చేశారు. గోడకు బంతి కొడితే ఎంత వేగంగా తిరిగి వస్తుందో ప్రజలు అదే చూపించారు. ఓ ఓ పెద్ద మనిషి అంటున్నాడు కన్నీరు కార్చి ప్రజలను సభకు వచ్చేలా చేశారు అని. కాంగ్రెస్ లో స్వాతంత్ర్యం ఎక్కువ కాంగ్రెస్ లో ప్రేమ ఎక్కువ. అది కావాలని ప్రజలు అనుకుంటున్నారు. హిట్లర్ ప్రభుత్వాన్ని కాదు నాయనా ప్రజలు కోరుకునేది. నిన్న వచ్చిన నేషనల్ మీడియా స్టేట్ మీడియాలో ఏ ఛానెల్ చూపించని న్యూస్ కేవలం మీ ఛానెల్ మీ కరపత్ర పేపర్ మాత్రమే చూపించాయి. నిన్న మీరు ఎంత కట్టడి చేసిన ప్రజలను సభకు రాకుండా ఆపలేక పోయారు. కొద్ది రోజుల్లో రాబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇదే తీర్పు రాబోతుంది. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజల దేవెనతో 10 కి 10 సీట్లు ఒడిస్తామని అన్నారు. కానీ నేను అంతటితో ఆగడం లేదు. ఎవరెన్ని కుయుక్తులు వాడిన ఎంత అధికార దుర్వినియోగం చేసిన రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలవబోతున్నాం. ఈ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం. ప్రజలకు మంచి ప్రభుత్వం అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

# అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం


**పార్టీ కార్యకర్తలతో బండి సంజయ్**

**రాష్ట్రంలో బీజేపీ సారథ్యంపై కొనసాగుతున్న సస్పెన్స్**

**నాయకత్వం ఆలోచన నేడో రేపో వెల్లడయ్యే చాన్స్**

**హైదరాబాద్ జూలై 3**

ఈ నెల 8వ తేదీన వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో హాజరౌతానో లేదోనని బండి సంజయ్ ఆదివారం హన్మకొండలో కార్యకర్తలతో అన్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలను బండి సంజయ్ నుంచి తప్పించి కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకుంటారని.. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమిస్తారని ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ పార్టీ కేడర్‌లో జోష్ నింపే ఆయన.. ఆదివారం ముభావంగా ఉండిపోయారు. 8న ప్రధాని మోదీ వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కిషన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి అక్కడ ఏర్పాట్లను సమీక్షించిన సంజయ్.. అంటీముట్టనట్లుగా



వ్యవహరించారు. వరంగల్‌లో జరిగిన మీడియా సమావేశంలో తన సహజశైలికి భిన్నంగా ముక్తసరిగా మాట్లాడారు. అనంతరం, ఎన్జీవో కాలనీలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యకర్తలు, నాయకులు సంజయ్‌కి మద్దతుగా నినాదాలు చేశారు. దీంతో, వారిని ఉత్తేజపరుస్తూ కొద్దిసేపు మాట్లాడారు. ప్రధాని సభను సక్సెస్ చేసి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం, కరీంనగర్ వెళ్లిపోయారు. ఒకవేళ పార్టీ రాష్ట్ర బాధ్యతల నుంచి తనను తప్పించినా.. అధైర్యపడవద్దని బండి సంజయ్ తనను అభిమానించే కార్యకర్తలు, నాయకులకు బండి నచ్చజెబుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేస్తున్నారు. అయితే, బండివల్లే తెలంగాణలో బీజేపీకి గ్రామీణ స్థాయి వరకు విస్తరించిందని, పోరాట స్ఫూర్తితోనే గ్రామాల్లో అధికార పక్ష నేతల అరాచకాలను ఎదుర్కొన్నామని కార్యకర్తలు ఆదివారం ఆయనతో అన్నారు. బండినే అధ్యక్షుడిగా కొనసాగించాలంటూ కార్యకర్తలు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా.. బండి సంజయ్ మనస్తాపానికి గురైన విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందని.. దీనిపై వారి నిర్ణయం ఏమిటో ఒకటి, రెండు రోజుల్లోనే తేలిపోతుందని.. కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఈ సస్పెన్స్ త్వరలోనే తెరపడుతుందని.. పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు.

ఛుగ్ ప్రకటించినా తప్పుడు ప్రచారం: విజయశాంతి వచ్చే ఏడాది పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగే దాకా బండి సంజయే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగుతారని రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ తరుణ్‌ఛుగ్ స్పష్టంగా ప్రకటించినా ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యక్ష మార్పు లేదని, నాలుగు రోజుల కిందట కూడా తరుణ్‌ఛుగ్ పునరుద్ఘాటించారని ఆమె గుర్తుచేశారు. సంజయ్‌ని మారుస్తున్నారంటూ ప్రచారం చేసేవాళ్లు, అందుకు కారణం ఏంటో మాత్రం చెప్పడం లేదని విజయశాంతి పేర్కొన్నారు. ఇక.. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి మార్పుపై తనతో ఎవరూ చర్చించలేదని బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు.

# జులై 05 న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్ విజయవంతం చేయండి




**ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరు పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఎమ్మిగనూరు శాఖ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు బాబా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జులై 05 న పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చిందని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజు ల దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల నియామకం జరపాలని, నారాయణ, శ్రీ చైతన్య ,భాష్యం లాంటి కార్పొరేట్, మరియు ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు , ఏక రూప దుస్తులు విక్రయాలు అరికట్టాలని, ఈ – టెక్నో, స్మార్ట్ ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ లాంటి బ్రాండ్ల పేర్లతో దోపిడీని అరికట్టాలని, సీబీఎస్ఈ పేరుతో ప్రైవేటు మరియు కార్పొరేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలను నియంత్రణ చేయాలి, ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఎటువంటి అనుమతులు లేకుండా కార్పొరేట్ మరియు ప్రైవేటు పాఠశాలలు అక్రమంగా నిర్వహిస్తున్న వసతి గృహాలు పై ఆకస్మిక తనిఖీలు చేసి వారి పై చర్యలు తీసుకోవాలని, డి ఎస్ సి ద్వారా ఖాళీగా ఉన్న 30 వేలకు పైగా టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి ప్రభుత్వ పాఠశాల లో త్వరగతిన పుస్తకాలు, ఏకరుప దుస్తులు విద్యార్థులకు అందించాలి, ఫీజుల నియంత్రణ కొరకు జిల్లా స్థాయిలో, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల భాగస్వామ్యం తో కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు.కావున పాఠశాల యాజమాన్యాలు సహకరించి బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్తిక్, రాజశేఖర్ మరియు ప్రకాశ్ లు పాల్గొన్నారు

# బీఎస్పీ పార్టీలో చేరికలు



**కోరుట్ల,**

పేద, బడుగు ,బలహీన వర్గాల పక్షాన నిలిచే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని ఆ పార్టీ కోరుట్ల పట్టణాధ్యక్షుడు, జగిత్యాల జిల్లా మైనారిటీ ఇంచార్జీ మహమ్మద్ ముజాహిద్ అన్నారు. నియోజక వర్గ యువకులు బీఎస్పీ పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం కొత్త బస్టాండ్ ఇన్ గెట్ వద్ద గల బీఎస్పీ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు ముజాహిద్ సమక్షంలో జిల్లా అధ్యక్షుడు గంధం అన్వేష్, సాయిదీప్, మారపాక మధు, బైన ప్రసాద్,శేఖర్ లు పార్టీ లో చేరారు. వారికి బీఎస్పీ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు..ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని అన్నారు. బీసీ వర్గాలకు 70 ఎమ్మెల్యే సీట్లు ఇస్తానని,మైనార్టీలకు 14 ఎమ్మెల్యే సీట్లు ఇస్తానని చెప్పినా ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ కొనియాడారు.బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్న్యాయకత్వాన్ని బలపరచాలని, రాబోయే రోజుల్లో యువతులు భారీ సంఖ్యలో బీఎస్పీ పార్టీలో చేరుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శనిగరపు ప్రశాంత్, కిషోర్,అక్షయ్,నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమర సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార, ప్రతిపక్షాలు

**అమరావతి జూలై 3**

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి అధికార, ప్రతిపక్షాలు సమర సన్నాహాల్లో మునిగి తేలుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ పెద్దఎత్తున ప్రజల్లోకి వెళుతుండడం.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గోదావరి జిల్లాల్లో పర్యటన చేపట్టడంతో పాలకపక్షం వైసీపీ కూడా జనంలోకి వెళ్లడానికి సమాయత్తమైంది. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇటీవల తమ పార్టీ ఎమ్మెల్యేలతో తాడేపల్లిలో వర్క్‌షాపు నిర్వహించారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం కింద నెల రోజులపాటు ఇంటింటికీ తిరగాలని ఆదేశించారు. వలంటీర్లు, గృహ సారథుల సాయంతో ఈ కార్యక్రమం ఎలా నిర్వహించాలో ఎమ్మెల్యేలకు వివరించారు. జనంలో తిరగకపోతే ఈసారి టికెట్లు ఇవ్వనని హెచ్చరించారు. దీని తర్వాత 'మళ్లీ జగనే ఎందుకు కావాలి' అని మరో కార్యక్రమం తలపెట్టారు. దానికి రెండ్రోజుల ముందు టీడీపీ రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశం నిర్వహించింది. మహానాడులో ప్రకటించిన ప్రాథమిక మేనిఫెస్టోను 'భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు చేయాలని నిర్ణయించి.. అదే రోజు ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఈ బస్సులను ప్రారంభించారు. నెల రోజులపాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ బస్సు యాత్రలు జరిపి మేనిఫెస్టోకు మంచి ప్రచారం కల్పించడం ఈ యాత్రల ఉద్దేశం. దాని ప్రకారం ప్రతి నియోజకవర్గంలో సీనియర్ నేతల ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు బస్సు యాత్రలు చేస్తున్నారు. ఈ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమం మొత్తం 150 రోజులపాటు ఉంటుంది. బస్సు యాత్ర తర్వాత పార్టీ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో గ్రామాలవారీ సమావేశాలు, ఇంటింటి ప్రచారం ఉంటుంది. గత కొన్ని నెలల నుంచి



అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం రకరకాల పేర్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించగా.. టీడీపీ 'బాదుడే బాదుడు', 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాలను నిర్వహించింది. వైసీపీ హయాంలో ప్రజలపై పడిన భారాలను, వేసిన పన్నులను, పెరిగిన అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఈ కార్యక్రమాలకు సమాంతరంగా పార్టీల అధినేతలు కూడా విస్తృతంగా ప్రజల్లో పర్యటిస్తున్నారు. టీడీపీ యువ నేత లోకేశ్ గత నాలుగు నెలలుగా విరామం లేకుండా పాదయాత్ర జరుపుతున్నారు. అనేక వర్గాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలు వినడం.. పరిష్కారానికి హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను ఆయన గట్టిగా ఎండగడుతున్నారు. మొదట్లో ఈ పాదయాత్రను పెద్దగా పట్టించుకోని అధికార పక్షం.. దానికి పెరుగుతున్న స్పందన చూశాక ఎదురుదాడి చేస్తోంది. చంద్రబాబు కూడా జిల్లాలు చుట్టేస్తున్నారు. రాజమండ్రి మహానాడుకు ముందు ఆయన ప్రతి వారం ఒక జిల్లాలో పర్యటించి రోడ్‌షోలు, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. మహానాడు తర్వాత వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని కొంత తగ్గించారు. జూలై నుంచి మళ్లీ పర్యటనలు మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా గత కొంత కాలంగా పర్యటనల జోరు పెంచారు. వివిధ సంక్షేమ పథకాలకు నిధులు విడుదల పేరుతో ఏదో ఒక నియోజకవర్గంలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వచ్చినా పట్టించుకోకుండా ఈ సభలకు ఆర్టీసీ బస్సులు, స్కూళ్లు, కాలేజీల బస్సులు పెద్ద ఎత్తున వినియోగించి డ్వాక్రా సంఘాల సభ్యులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను భారీగా తరలించి తమకు ప్రజాదరణ తరగలేదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గడప గడపకు నిరసన వ్యక్తమవుతుండడంతో 'జగనన్నకు చెబుదాం'తో ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎవరి వ్యూహం వారిది..ఎన్నికల తేదీ వెలువడే వరకూ గుప్పిట విప్పబోదని అనుకునే టీడీపీ మొదటిసారిగా పది నెలల ముందు తొలి విడత మేనిఫెస్టోను ప్రకటించింది. సంక్షేమ పథకాలను వైసీపీ కంటే తామే ఎక్కువ ఇస్తామని చాటుకునేందుకు ఆకర్షణీయ పథకాలకు రూపకల్పన చేసింది. ప్రజల్లో మరింత చర్చించి వచ్చే దసరా నాటికి పూర్తి స్థాయి మేనిఫెస్టో ప్రకటిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇక వైసీపీ ప్రభుత్వం తనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను తగ్గించుకోవడానికి 'జగనన్నకు చెబుదాం', 'జగనన్న సురక్ష' పథకాలను ముందుకు తెచ్చింది. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి ఒక పథకం, ఆ ఫిర్యాదులు ఎంత వరకూ పరిష్కారం అయ్యాయన్నదానిపై పరిశీలనకు రెండో పథకాన్ని చేపట్టింది. కొన్ని సమస్యలైనా పరిష్కారమైతే వ్యతిరేకత కొంత తగ్గుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, వివిధ వర్గాల్లో పార్టీ గ్రాఫ్ ఎలా ఉందన్నదానిపై ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే సర్వేలు కూడా మొదలు పెట్టాయి. దీనికి సమాంతరంగా అభ్యర్థుల ఎంపిక కసరత్తు కూడా జరుగుతోంది. తమ సిటింగ్ ఎమ్మెల్యేల్లో 18 మంది పనితీరు బాగోలేదని ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా వ్యాఖ్యానించారు. కొందరు సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చే అవకాశం ఉందన్న సంకేతాలిచ్చారు. అయితే బలహీనంగా ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య దీనికి రెట్టింపు ఉందని వైసీపీ వర్గాల్లో వినవస్తోంది. వారి స్థానంలో కొత్త ముఖాల కోసం అన్వేషణ జరుగుతోందని అంటున్నారు. ఉదాహరణకు అనంతపురం జిల్లాలో 8 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. టీడీపీ అధినాయకత్వం కూడా ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై నిశితంగా కసరత్తు చేస్తోంది. ఇంకా 25 నియోజకవర్గాలపైనే తమ నాయకత్వం నిర్ణయం తీసుకోవలసి ఉందని, మిగిలిన చోట్ల అభ్యర్థులపై ఇప్పటికే అంతర్గతంగా ఒక నిర్ణయానికి వచ్చిందని టీడీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనసేనతో పొత్తు అంశం పరిశీలనలో ఉండడంతో ఆ పార్టీ అధినాయకత్వం కొన్ని నియోజకవర్గాల విషయంలో కొంత ఆచితూచి వ్యవహరిస్తోందని అంటున్నారు. కొత్త వారికి కనీసం 40శాతం టికెట్లు ఇవ్వాలన్న నిర్ణయానికి అనుగుణంగా మాజీల్లో బలహీనంగా ఉన్నవారిని పక్కన పెట్టాలని యోచిస్తోంది. జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు ఇద్దరూ రెండు నెలలుగా సిటింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల సన్నద్ధత, నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై చర్చిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారు.

**వారాహిపై పవన్..**

అధికార, ప్రతిపక్షాలకు దీటుగా జనసేన కూడా ఎన్నికల కసరత్తు మొదలు పెట్టింది. వారాహి పేరుతో ప్రత్యేక ప్రచార వాహనం తయారు చేయించుకున్న పవన్‌కల్యాణ్ ఇప్పటికే తన పర్యటనలు ప్రారంభించారు. బహిరంగ సభలకే పరిమితం కాకుండా మార్గమధ్యంలో వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తూ హామీలతో ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తన పర్యటనల ద్వారా తమ పార్టీ కార్యకర్తలను, సానుభూతిపరులను ఉత్తేజపరచి ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఈ మూడు ప్రధాన పార్టీలు క్షేత్ర స్థాయిలో పనిచేయడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో కూడా బలం చాటడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాయి. ప్రస్తుతం వారి పోరాటం డిజిటల్ రంగానికి కూడా విస్తరించింది. పరస్పర విమర్శలు, ఎదుటివారిపై ఎత్తి పొడుపులు, వ్యంగాస్త్రాలతో సామాజిక మాధ్యమ రంగం ఇప్పటికే కోలాహలంగా మారింది.

# ఈటలతో నాకు విభేదాలు లేవు

**మాజీ ఎంపి జితేందర్ రెడ్డి**

**హైదరాబాద్**

ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తో తనకు విభేదాలు లేవని మాజీ ఎంపి జితేందర్ రెడ్డి స్పష్టం చేసారు. ఈటలకు కీలక పదవి ఇస్తే నేను స్వాగతిస్తా. ఈటలతో కలసి పదేళ్ళు తెలంగాణ ఉద్యమంలో కలసి పనిచేశానని గుర్తు చేసారు. ఆర్థికమంత్రిగా ఢిల్లీ వచ్చినప్పుడు ఈటల నా ఇంట్లోనే ఉండేవారు. హుజూరాబాద్ లో ఈటల గెలుపు కోసం నేను కృషి చేశాను. ఈటల సహా... పార్టీ నేతలందరం కలుసే ఉంటామని అయన అన్నారు. బీజేపీ అధ్యక్షుడి మార్పుపై నాకు సమాచారం లేదు. నేను బీజేపీ అధ్యక్షుడు రేసులో లేను. పార్టీ ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తాను.

2004లో టీఆర్ఎస్ తో బంధుత్వం ఎవరు పెట్టుకున్నారో రాహుల్ గాంధీ తెలుసుకోవాలి.



బీజేపీపై రాహుల్ గాంధి కామెంట్స్ ను ఖండిస్తున్నాను. రాహుల్ గాంధీ కామెంట్స్ పై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ కు మహబూబ్నగర్ జిల్లాలో నలుగురు అభ్యర్థులు కూడా లేరు. నిజామాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ కు అభ్యర్థులే లేరు. పొంగులేటి చేరికతో... వాపును చూసి కాంగ్రెస్ బలుపు అనుకుంటున్నారు కాంగ్రెస్ నేతలని అయన అన్నారు.

# తిరుమలలో శునకంతో కర్ణాటక భక్తుల హల్ చల్

**తిరుమల, జూలై 3:**

తిరుమలలో శునకం హల్ చల్ చేసింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకి వచ్చిన కర్ణాటక భక్తులతో పాటు వాహనంలో వారి పెంపుడు కుక్కని తిరుమలకి తీసుకొని రావడంతో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బట్ట బయలు అయింది. తిరుమలలో వన్య మృగాల సంచారం నేపథ్యంలో శునకాలని కొండ పైకి టీటీడీ నిషేధించింది. స్థానికులు నివసించే బాలాజీనగర్ లో కూడా శునకాలని పెంచడాన్ని కూడా టీటీడీ నిషేధించింది. అయితే కర్ణాటకకి చెందిన భక్తులు వారి టెంపో వాహనంలో కుక్కని తీసుకొచ్చినా.. భద్రతా సిబ్బంది పట్టించుకోక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. భక్తులు కుక్కని వారి వాహనంలోనే పెట్టుకొని కొండపై చక్కర్లు కొడుతుండగా తీసిన వీడియోలు నెట్టింటి వైరల్ అవుతున్నాయి. ఈక్రమంలోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బందిపై భక్తులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా చిరుత సంచారం పెరిగిన నేపథ్యంలో శునకం కోసం చిరుత జనవాసాల్లోకి వస్తే పరిస్థితి ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అలిపిరి తనిఖీ సమయంలో.. టిటిడి సిబ్బంది గుర్తించి ముందస్తుగానే అనుమతిని నిరాకరించాలని భక్తులు కోరుతున్నారు.తిరుమలలో సంచలనం రేపిన ఆనంద నిలయం ఫొటోలు, వీడియోలు తీసిన వ్యక్తిని టీటీడీ అధికారులు పట్టుకున్నారు. రాహుల్ రెడ్డి అన్నే భక్తుడు ఆనంద నిలయం వీడియో చిత్రికరించినట్లు టీటీడీ ఆలయ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రాహుల్ ఉద్దేశ పూర్వకంగానే వీడియో చిత్రికరణ చేసినట్టు వివరించారు. ప్రస్తుతం రాహుల్ రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ జరుపుతున్నారని ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. సెక్యూరిటీ వైఫల్యాన్ని తీవ్రంగా పరిగణించామన్నారు. ఈ క్రమంలోనే సీవీఎస్వో, వీజీవోతో పాటు భద్రత అధికారులను మందలించామన్నారు. భద్రతా వైఫల్యానికి కారణమైన సెక్యూరిటీ సిబ్బందిని సస్పెండ్ చేస్తామన్నారు. శ్రీవారి ఆలయంలో పవర్ కట్ అయ్యే పరిస్థితి లేదని.. తిరుమల చరిత్రలో రెండు గంటల పాటు కరెంటు పొయిన పరిస్థితి లేదన్నారు. టీటీడీ తరుపున ఇలాంటి ప్రకటన ఎలా ఇచ్చారో తనకు తెలియడం లేదని చెప్పుకొచ్చారు. శ్రీవారి ఆలయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు పొయ్యే పరిస్థితి లేదన్నారు. డిపాజిట్ రీఫండ్ కావడం లేదని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఆలయ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. వెను వెంటనే భక్తులకి కాషన్ డిపాజిట్ అందే విదంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుద్ద కార్మికులు సమ్మెకీ వెళ్లడంతో తిరుమలలో పారిశుద్ధ్య పనుల్లో కొంత లోపాలు కనిపిస్తున్నట్లు వివరించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె ముగిసిన తర్వాత తిరుమలని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నినారు. అన్నదానంలో బియ్యం, లడ్డు నాణ్యత లోపించిందంటూ భక్తులు ఫిర్యాదు చేశారని అన్నారు. నాణ్యమైన బియ్యానే టీటీడీ వినియోగిస్తుందని.. లడ్డు నాణ్యతని మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. రెండు ఘాట్ రోడ్లతో పాటు అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారుల్లో ఉద్యోగుల నేతృత్వంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ రహిత తిరుమల కోసం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున్న నిర్వహిస్తున్నామన్నారు

# శిథిలావస్థలో బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పాత భవనం

**బద్వేలు**

బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ పాత భవనం శిథిలావస్థలో ఉంది దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ భవనానికి ఇదే పరిస్థితి గోపవరం మండలం సముదాయంలో ఈ భవనాన్ని అప్పట్లో దాదాపు 15 లక్షల రూపాయలతో నిర్మించారు అప్పటి జిల్లా ఎస్పీ గోవింద సింగ్ అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి దివంగత వీరారెడ్డి అప్పటి జిల్లా కలెక్టర్ ఈ భవనాన్ని ప్రారంభించారు భవనం ప్రారంభించిన కేవలం మూడు నెలలు మాత్రమే రూరల్ పోలీస్ స్టేషన్ కొత్త భవనంలో కొనసాగింది జాతీయ రహదారికి అత్యంత సమీపంలోనే ఈ భవనం ఉంది పోలీస్ స్టేషన్ కు సమీపంలోని ఎరసల కనుమల్లో భారీ ఎన్కౌంటర్ జరిగి దాదాపు పదిమంది మావోయిస్టులు మృతి చెందారు అప్పట్లో ఈ విషయం కడప నెల్లూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది ఎన్కౌంటర్ జరిగిన తర్వాత కొన్ని నెలలు ఈ భవనంలోనే పోలీస్ స్టేషన్ కొనసాగింది ఆ తర్వాత పోలీస్ స్టేషన్కు రక్షణ ఉండదన్న భయంతో రూరల్ పోలీస్ స్టేషన్ బద్వేల్ కు తరలించారు అప్పటినుంచి బద్వేల్ లోనే పోలీస్ స్టేషన్ కొనసాగుతుంది బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ కు ఘనమైన చరిత్ర ఉంది బద్వేల్ లో ఒకప్పుడు కేవలం ఒక పోలీస్ స్టేషన్ మాత్రమే ఉండేది బద్వేల్ లో ఉన్న గోపవరం మండలం పోలీస్ స్టేషన్ కు బద్వేల్



పోలీస్ స్టేషన్ గా మార్పు చేసి కొన్ని రోజులు బద్వేల్ లోనే ఉంచారు ముందు గోపవరం మండలం బ్రాహ్మణ పల్లెలో మొట్టమొదట పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు ఆ తర్వాత కొద్ది కాలానికి గోపవరం కాలనీ లో ఉన్న భవనాల లోకి స్టేషన్ తరలించారు ఆ తర్వాత మరికొద్దికాలానికి బద్వేల్ పట్టణానికి తరలించడం జరిగింది అప్పట్లో గోపవరం మండలానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ భవనం ఉండాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు పంపారుఆ మేరకు కొత్త భవనాన్ని నిర్మించారు భవనం నిర్మించిన కొన్ని నెలలకే ప్రారంభించారు కొత్త భవనం లోకి బద్వేల్ లో ఉన్న పోలీస్ స్టేషన్ ను తరలించారుకాస్త మున్నాళ్ళ ముచ్చటగా మారింది పోలీస్ స్టేషన్ తిరిగి బద్వేల్ కు వచ్చిన తర్వాత సరైన అలనా పాలనా లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది ఈ భవనం ఇప్పుడు అత్యంత దయనీయంగా మారింది అని చెప్పాలి భవనం పూర్తిగా శిథిలం కాకముందే ఉన్నతాధికారులు దీని పై దృష్టి పెట్టాలి ఈ మేరకు మండల ప్రజలు కోరుతున్నారు

# అర్జీదారుల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలి

**జగిత్యాల**

అర్జీదారుల సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం రోజున సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీ దారుల నుండి పలు సమస్యలపై దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించారు. భూ సంబంధం, ఉపాధి, పింఛన్లు , తదితర అంశాలపై దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ, సమస్యను పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని



పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. వివిధ సమస్యలపై 22 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఈ ప్రజావాణి లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మంద మకరంద, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గురువును ఆశ్రయించి ఆచరించినప్పుడే పరమార్థం

**కౌతాళం**

గురువును ఆశ్రయించి ఆచరించినప్పుడే పరమార్థ జీవితం తెలుస్తుందని సాయి పురోహిత్ పేర్కొన్నారు. సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా కౌతాళ మండలం రాజన్నగర్ క్యాంపులో సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి సన్నిధిలో సాయిబాబాను పన్నీటి స్నానంతో స్నానం చేయించి కొత్త బట్టలు వేసి పూలమాలలు వేసి అందంగా అలంకరించారు.. ఉదయమే 5 గంటలకు హారతీతో ప్రారంభమై రాత్రి 8 గంటల హారతితో ముగించారు. ఎనిమిది గంటలకు పాలభిషేకం నిర్వహించారు. భక్తీ శ్రద్ధలతో 10 గంటలకు సత్య వ్రతాలు పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయి సన్నిధిలో సాయిబాబా పారాయణం చదివి వినిపించారు.

# రోడెక్కిన ఆదివాసీలు

**అదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ఆదివాసీలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. తమ ఆదివాసీల్లోని ఓ మహిళను దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై అడవి బిడ్డలు భగ్గుమన్నారు. నిందితులను ఉరి తీయాలంటూ డిమాండ్ చేశారు. ఔఖీ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నిందితులను వెంటనే శిక్షించాలని పట్టుబట్టారు. దీంతో స్థానికంగా కాసేపు టెన్షన్ వాతావరణం నెలకొంది.జూన్ 20న ఆదిలాబాద్ జిల్లా దనోరా బస్టాండ్ సమీపంలో ఒంటరిగా ఉన్న జంగుబాయి అనే మహిళను మాయమాటలు చెప్పి అదే జిల్లాకు చెందిన ముగ్గురు అత్యాచారం చేశారని ఆదివాసీలు ఆరోపించారు. ఆపై ఆమె గొంతునులుమి బావిలో పడేశారని వాపోయారు.వ్యవసాయ కూలీలు బావిలోనుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి వెల్లి చూశారు.. అక్కడ వారికి మృతదేహం కనిపించింది.దీంతో వెంటనే పోలీసులను ఆశ్రయించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆదివాసీల సాయంతో బావిలో నుంచి మహిళ మృతదేహాన్ని వెలికి తీయించారు. ఆపై ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంబంధిత సెక్షన్ల కింద నిందితులపై కేసులు నమోదు చేశారు?ఐతే నిందితులను ఉరి తీయాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివాసీలు ఆందోళనకు దిగారు..

# భాగ్ సాలే చిత్రంలో కొత్త కామెడీ టైమింగ్‌ను చూస్తారు




శ్రీసింహా కోడూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా భాగ్ సాలే. నేహా సోలంకి నాయికగా నటించింది. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీ గా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ నిర్మాతగా.. బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్ తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించారు. జూలై 7న భాగ్ సాలే రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ క్రమంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు డైరెక్టర్లు హరీష్ శంకర్, దశరద్, వశిష్ట వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో చిత్రయూనిట్ మాట్లాడుతూ..

హరీష్ శంకర్ మాట్లాడుతూ.. 'మత్తువదలరా సినిమా చూశాక సింహాకు ఫ్యాన్ అయ్యాను. కలర్ ఫోటో సినిమా చూసి కాళ భైరవకు ఫ్యాన్ అయ్యాను. ఈ ఇద్దరూ ఎంతో ఒదిగి, ఎంతో సింపుల్‌గా ఉంటారు. ప్రణీత్ తీసిన సూర్యకాంతం సినిమా నాకు నచ్చింది. భాగ్ సాలే కథ నాకు చెప్పాడు. నాకు చాలా బాగా నచ్చింది. ఈ సినిమా అంతా సరదాగా సాగుతూ ఉంటుంది. కాలేజ్ ఎగ్గొట్టి సినిమాకు వెళ్తుంటారు. కానీ కాలేజ్ ఎగ్గొట్టి ఈ సినిమాను తీసినట్టుగా అనిపిస్తుంది. ప్రణీత్‌కు మంచి కామెడీ టైమింగ్ ఉంది. ప్రతీసారి ప్రొగ్రెస్‌మెంట్ గురించి ఆలోచిస్తుంటాడు. నేను ఈ సినిమాను నిర్మించాల్సింది కానీ మిస్ అయింది. నేను ఆల్రెడీ సినిమాను చూశాను. కొత్త కామెడీ టైమింగ్‌ను చూస్తారు. కాళ భైరవ ఇచ్చిన ఆర్ఆర్ అద్భుతంగా ఉంటుంది. తండ్రి పేరును నిలబెడతాడు. జూలై 7న మంచి ఎంటర్టైన్మెంట్ సినిమా చూడబోతోన్నారు. నేను, విష్ణు కలిసి ప్రణీత్‌తో ఓ సినిమాను చేయబోతోన్నాం. సింహాలో మంచి టైమింగ్ ఉంటుంది. అంతే కాకుండా మంచి సంస్కారం, వ్యక్తిత్వం ఉంది' అని అన్నారు.

అర్జున్ దాస్యన్ మాట్లాడుతూ.. 'భాగ్ సాలే అనేది క్రైమ్ కామెడీ జానర్. నాకు ఆ జానర్ సినిమాలు చాలా ఇష్టం. ట్రైలర్ చూశాక సినిమా హిట్ అవుతుందని మరింత నమ్మకంగా కలిగింది. జూలై 7న ఈ సినిమా రాబోతోంది. మ్యూజిక్ బాగా వచ్చింది. కాళ భైరవ రీరికార్డింగ్ అద్భుతంగా వచ్చింది. కాస్త ఆలస్యం అయింది కానీ అద్భుతంగా చేశాడు. ప్రణీత్‌కు మంచి ఫ్యూచర్. ఆయనతో త్వరలోనే మరో సినిమా చేస్తాను. దళపతి విజయ్‌లో ఉండే ఇన్నోసెన్స్ సింహాలో ఉందని ఓ ఓటీటీ హెడ్ అన్నారు. అంత పెద్ద ఫ్యామిలీ నుంచి వచ్చినా ఈ అన్నదమ్ములిద్దరికీ కొంచెం కూడా గర్వం లేదు. మా ఈవెంట్‌కు వచ్చిన గెస్టులకు థాంక్స్. జూలై 7న థియేటర్లో అందరినీ నవ్వించబోతోన్నామ'ని అన్నారు

.శ్రీ సింహా మాట్లాడుతూ.. 'మా ఈవెంట్‌కు వచ్చిన హరీష్ శంకర్ గారు, దశరద్ గారు, వశిష్ట, విష్ణు గారికి థాంక్స్. మా సినిమా గురించి వీడియో బైట్ ఇచ్చిన చిరంజీవి గారికి థాంక్స్. వాయిస్ ఓవర్ ఇచ్చిన సిద్దు జొన్నలగడ్డకు థాంక్స్. రాజీవ్ మామ, జాన్ వంటి సీనియర్లతో నటించడం ఆనందంగా ఉంది. కెమెరామెన్ రమేష్, ఆర్ట్ డైరెక్టర్ శ్రుతి, ఎడిటర్ కార్తిక్‌లకు థాంక్స్. కాళ భైరవ మాకు మ్యూజిక్ చేయడం ఆనందంగా ఉంది. ప్రణీత్ అన్న ఎప్పుడూ కూడా ఇంప్రూవ్‌మెంట్ కోసం చూస్తుంటాడు. షూటింగ్‌కు వెళ్లే ముందు వరకూ పదిహేను వర్షెన్స్ రాసుకున్నారు. మా సినిమాను ఇంతలా సపోర్ట్ చేసిన మా నిర్మాతలు అర్జున్, యశ్ గారికి థాంక్స్. జూలై 7న థియేటర్లోకి ఈ సినిమా రాబోతోంది. అందర్నీ కచ్చితంగా నవ్విస్తామ'ని అన్నారు.

# అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ నాలుగో సినిమా




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'జులాయి', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' సినిమాలు రూపొందాయి. ఈ మూడు సినిమాలు కూడా ఒకదానికి మించి మరొకటి అన్నట్టుగా ఘన విజయం సాధించాయి. ముఖ్యంగా 'అల వైకుంఠపురములో' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందింది.

గురు పూర్ణిమ శుభ సందర్భంగా, వీరి కలయికలో నాలుగో సినిమా ప్రకటన వచ్చింది. ఈసారి ఈ కలయిక తెలుగు ప్రేక్షకులతో పాటు ప్రపంచ సినీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

'అల వైకుంఠపురములో' చిత్రంలోని 'సామజవరగమన', 'బుట్ట బొమ్మ', 'రాములో రాముల' పాటలు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఇప్పుడు ఈ అద్భుతమైన కాంబినేషన్ మనం వెండితెరపై మునుపెన్నడూ చూడని దృశ్యకావ్యాన్ని అందించడానికి చేతులు కలిపింది.

ఈ కలయిక వినోదాన్ని అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ యొక్క అద్భుతమైన కథాకథనాలు, ఈ కలయికలో వచ్చిన ప్రతి సినిమాని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేశాయి. "రవీంద్ర నారాయణ్", "విరాజ్ ఆనంద్", "బంటు" వంటి పాత్రల్లో అల్లు అర్జున్ జీవించారు. ప్రతి పాత్ర ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

అగ్ర చిత్ర నిర్మాణ సంస్థ హారిక ు హాసిని క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం.8 కోసం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు వారి ప్రియతమ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో మరోసారి జతకట్టారు. అల్లు అర్జున్, త్రివిక్రమ్ కలయికలో రూపొంది ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మూడు సినిమాలనూ హారిక ు హాసిని క్రియేషన్స్ భారీ స్థాయిలో నిర్మించింది. ఇప్పుడు ఈ నాలుగో సినిమాని మరింత భారీస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులందరినీ సంతృప్తి పరచడానికి అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

హారిక ు హాసిని క్రియేషన్స్‌తో కలిసి 'అల వైకుంఠపురములో' నిర్మాణంలో భాగమైన ప్రసిద్ధ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఇప్పుడు ఈ చిత్ర నిర్మాణంలోనూ భాగం అవుతుంది. ఈ చిత్రాన్ని పద్మశ్రీ అల్లు రామలింగయ్య మరియు శ్రీమతి మమత సమర్పణలో హారిక ు హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

అల్లు అర్జున్, త్రివిక్రమ్ కలయికలో రూపొందనున్న నాలుగో సినిమాని ఈరోజు ఉదయం 10:08 గంటలకు ప్రకటించారు. ఈ సందర్భంగా అనౌన్స్ మెంట్ వీడియోని విడుదల చేశారు. గత చిత్రాలను మించి అత్యంత భారీ స్థాయిలో అద్భుతమైన అనుభూతిని పంచే చిత్రాన్ని అందించబోతున్నామని వీడియో ద్వారా తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్రబృందం త్వరలో ప్రకటించనుంది.

# 'మహావీరుడు' థియేట్రికల్ ట్రైలర్ విడుదల



హీరో శివకార్తికేయ, మండేలా ఫేమ్ మడోన్ అశ్విన్ దర్శకత్వంలో చేస్తున్న పొలిటికల్ డ్రామా మహావీరుడు. అదితి శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ లోకి వెళితే.. శివకార్తికేయన్ వార్తాపత్రికలో పనిచేసే కార్టూనిస్ట్ పాత్రను పోషిస్తున్నారు. అనుకోకుండా ఓ రాజకీయ నాయకుడి పోస్టర్ చించడం వలన ఇబ్బందుల్లో పడతాడు. ఇందులో ఫాంటసీ ఎలిమెంట్స్ కూడా వున్నాయి. శివకార్తికేయన్ పైకి చూసినపుడు భిన్నమైన వ్యక్తిగా మారడం ఆసక్తికరంగా వుంది. ట్రైలర్ చాలా ఎక్సయిటింగా వుంది. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో శివకార్తికేయన్ అద్భుతమైన నటనను కనబరిచాడు. మిస్కిన్ విలన్‌గా నటించగా, సునీల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఫిలోమిన్ రాజ్ ఎడిటర్. విధు అయ్యన్న కెమెరామెన్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రంలో యోగి బాబు, సరిత వంటి స్టార్ తారాగణం కూడా ఉంది. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏషియన్ సినిమాస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్ గా రిలీజ్ చేస్తోంది. జూలై 14న మహావీరుడు విడుదల కానుంది.

తారాగణం: శివకార్తికేయన్, యోగి బాబు, సునీల్, మిస్కిన్, సరిత తదితరులు.

# ఆగస్ట్ 4న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి



వైవిధ్యమైన పాత్రలో నటుడిగా తనకంటూ గుర్తింపు సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ప్రముఖ నిర్మాణ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా ఆగస్ట్ 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.

యువీ క్రియేషన్స్ బ్యానర్‌లో 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత అనుష్క నటిస్తోన్న చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' . సినిమా అనౌన్స్‌మెంట్ నుంచి బజ్ క్రియేట్ అయ్యింది. అందుకు తగినట్లు ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు సాంగ్స్ రిలీజ్ కాగా.. వాటికి ఆడియెన్స్ నుంచి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. అందులో ఓ పాటను కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ పాడటం విశేషం. ఈ క్రమంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు.

అన్విత రవళి శెట్టి పాత్రలో అనుష్క.. స్టాండప్ కమెడియన్ సిద్ధు పొలిశెట్టి పాత్రలో నవీన్ పొలిశెట్టి పాత్రలు మనసులను హత్తుకునేలా రూపొందించారు. టీజర్ చూడగానే ఆ విషయం క్లియర్‌గా తెలిసిపోతుంది. తాజాగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను గమనిస్తే.. అందులోనూ హీరో హీరోయిన్లు ఉన్నారు. ఓ ప్లెజంట్ ఫీలింగ్ ఇచ్చేలా పోస్టర్ ఉంది. ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' మెప్పించటానికి ఆగస్ట్ 4న మన ముందుకు వచ్చేస్తుంది.

# స్కంద గ్లింప్స్ విడుదల



బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, ఉస్తాద్ రామ్ పోతినేని కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. కార్తికేయ, సుబ్రహ్మణ్య స్వామి యొక్క మరొక పేరు అయిన 'స్కంద'ని టైటిల్ గా లాక్ చేశారు మేకర్స్. ఎటాకర్ అనే ట్యాగ్ లైన్ హీరో ఫెరోషియస్ స్వభావాన్ని సూచిస్తోంది. కార్తికేయస్వామి ఆయుధం శూలం టైటిల్ లోగోలో వుంది.

టైటిల్ గ్లింప్స్ లో రామ్ మాస్, రగ్గడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. గుడిలోని చెరువులో గూండాల ముఠాపై ఫైట్ చేస్తూ ఎటాకింగ్ మోడ్ లో కనిపించారు."మీరు దిగితే ఊడేదుండదు... నేను దిగితే మిగిలేదుండదు" అనే పవర్-ప్యాక్డ్ డైలాగ్ తో ఆకట్టుకున్నారు రామ్.

స్టన్ శివ కొరియోగ్రఫీ చేసిన ఈ హై-ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌లో అద్భుతమైన బ్లాక్స్ ఉన్నాయి. థమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం విజువల్స్ మాస్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లింది. టైటిల్ గ్లింప్స్ తుఫాను సృష్టిస్తుంది.

మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీల రామ్ సరసన కథానాయికగా నటిస్తోంది. సంతోష్ డిటాకే కెమెరామెన్ గా పని చేస్తున్న ఈ చిత్రానికి ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై అత్యున్నతమైన సాంకేతిక ప్రమాణాలు, నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తునారు. జీ స్టూడియోస్ , పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఎడిటింగ్ తమ్మిరాజు.

'స్కంద' తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950